PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 206 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 22 జులై 2026


**నీట్ లీకేజీపై కేంద్రానికి సీపీఐ హెచ్చరిక**




**మల్లంపల్లిలో ఘనంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే 84వ జన్మదిన వేడుకలు**






- కాంగ్రెస్ ధర్నాతో స్వల్ప ఉద్రిక్తత
- బలవంతంగా అరెస్ట్ చేసి తరలించిన పోలీసులు
- రాహుల్ సహా కాంగ్రెస్ నేతల అరెస్ట్

# ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ మెరుపు ధర్నా

**న్యూఢిల్లీ,జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాసం ముందు ఆందోళన చేసిన రాహుల్ గాంధీ.. కాంగ్రెస్, మిత్రపక్షాల ఎంపీలను పోలీసులు మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కి తరలిం చారు. మందిర్ మార్గ్ పోలీసు స్టేషన్‌లో ఉన్న ఎంపీలను కలిసేందుకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్ పర్సన్ సోనియా గాంధీ వెళ్లారు. అయితే, పోలీసులు సోనియాగాంధీని లోపలికి అనుమతించలేదు. భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. సోమవారం జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్, మిత్ర పక్షాల ఎంపీలు పాల్గొ న్నారు. కాంగ్రెస్ మిగతా2లో...

# వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు
- ఉత్సవానికి హాజరైన సిఎం సతీమణి



**హైదరాబాద్,జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారికి మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్.. ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కళ్యాణోత్సవానికి సిఎం రేవంత్ సతీమణి కూతురుతో కలిసి హాజరయ్యారు. అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. మాజీమంత్రి తలసాని కూడా హాజరయ్యారు. వీరి రాకతో పకడ్బందీగా మిగతా2లో...

# ఎల్‌నినో సవాళ్లపై పక్కా ప్రణాళికలు

- సాగు,తాగునీటి సవాళ్లను ఎదుర్కొనేలా చర్యలు
- డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క వెల్లడి



**హైదరాబాద్,జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎల్ నినో సవాళ్లను ఎదుర్కొనేందుకు తెలంగాణ సర్కార్ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఎల్ నినోపై రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాలపై ఈ ప్రభావాన్ని తగ్గించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రతి గ్రామంలో ఎల్ నినోపై అవగాహన కల్పించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతులకు తక్కువ మిగతా2లో...



# సన్న వడ్ల కుంభకోనం గతంలో జరిగిందేమో

**ఈ ప్రభుత్వంలో అలాంటిదేమీ జరగలేదు**

**హరీష్ రావు తదితరుల విమర్శలకు మంత్రి ఉత్తమ్ కౌంటర్**

**హైదరాబాద్,జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ ప్రభుత్వంలో సన్న వడ్ల కుంభకోణం అనేది అవాస్తవమని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దీనిపై మీడియా - సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదని అన్నారు. కొందరు కావాలని సన్న వడ్ల కుంభకోణం అంటూ తప్పుడు ప్రచారం మిగతా2లో...

# ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

- ప్రత్యామ్నాయ ప్రయత్నాల్లో ఉన్నాం
- వర్షాభావాన్ని ఎదుర్కొనేందుకు సమిష్టిగా కృషి
- కంటింజెన్సీ ప్రణాళికలను అమలు చేయాలి
- హన్మకొండ కలెక్టరేట్‌లో సమీక్షించిన మంత్రి పొంగులేటి



**హన్మకొండ,జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

మిగతా2లో...

# దేశ యువత కోసం రాహుల్ పోరాటం

- ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ రెడ్డి పోస్ట్






# ఉద్యమకారులకు వెంటనే న్యాయం చేయండి

**కెకె కమిటీకి నివేదిక అందించిన కవిత**

**హైదరాబాద్,జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కోసం పోరాడిన ఉద్యమకారులకు న్యాయం చేసే విషయంలో ఆలస్యం చేయవద్దని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీకి టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలంటూ కవిత రూపొందించిన నివేదికను ఆ కమిటీకి మంగళవారం ఆమె అందజేశారు. అనంతరం ట్యాంక్ బండ సమీపంలోని అమరజ్యోతి వద్ద ఆమె మాట్లాడుతూ.. మిగతా2లో...

# జిహెచ్ఎంసి ఎన్నికల కోసమే ఇళ్ల నాటకం

**ప్రజల నుంచి పదివేల కోట్లు వసూళ్లకు పన్నాగం**

**భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శలు**







# రైతులను ఆరుతడి పంటలవైపు మళ్లించాలి

**ఎల్‌నినోతో వర్షాభావంపై అధికారులతో చర్చలు**

**కార్యాచరణతో ముందుకు**

**సాగాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆదేశం**

**రంగారెడ్డి,జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి వచ్చే అవకాశం ఉన్నందున రైతులను పండ్ల తోటలు, అరుతడి పంటల వైపు మళ్లించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో మిగతా2లో...




# కాళేశ్వరంపై ఇన్ని అబద్ధాలా?

**నీళ్లు కిందికి పోతున్నా పట్టింపు లేదా..?**

**దేవాదుల విషయంలోనూ అదే ద్రోహం**

**రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్**

**మీడియా సమావేశంలో మండిపడ్డ హరీష్ రావు**

# ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ మెరుపు ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

నేతలు చేతులకుసంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. ఈ నిరసనలు ఉద్రిక్తతకు దారి తీయటంతో పోలీసులు బలవంతంగా వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాహుల్, ఖర్గే, ప్రియాంకలను అరెస్ట్ చేసి బలవంతంగా తరలించారు. ఇకపోతే మంగళవారం ఈ నిరసనలు పొలిటికల్ టర్న్ తీసుకున్నాయి. కాంగ్రెస్ నేతలు ప్రధాని నరేంద్రమోడీ నివాసం ముందు ధర్నా చేశారు. కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గే, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌లు కూడా ఈ ధర్నాలో పాల్గొన్నారు. విద్యార్థులపై దాడికి నిరసనగా ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని పిలుపునిచ్చారు. అయితే కాంగ్రెస్ ధర్నా చేసిన ప్రాంతాన్ని పోలీసులు ఖాళీ చేయించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీను అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌తో పాటు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని బస్సుల్లో తరలించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకను పోలీసులు వేర్వేరు స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో వున్న ప్రియాంకా గాంధీ వాద్రాను కలిసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ అక్కడికి చేరుకున్నారు. తొలుత ఆమెను లోపలికి పంపేందుకు పోలీసులు నిరాకరించారు. ఆ తర్వాత కాసేపటికి లోపలికి పంపడంతో ప్రియాంకను ఆమె కలిశారు. ఇదిలా ఉండగా.. రాహుల్‌ను మోడల్ టౌన్‌లోని ఛత్రసాల్ స్టేడియానికి పోలీసులు తరలించినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ ధర్నా వద్దకు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి, ప్రధాని కార్యాలయ బాధ్యతలు చూస్తున్న జితేంద్ర సింగ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్.. రాహుల్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కేంద్రం ముందు రాహుల్ ప్రధానంగా రెండు డిమాండ్లు ఉంచారు. ఎట్టిపరిస్థితుల్లో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నిన్న విద్యార్థులపై లాఠీఛార్జి చేసిన ఘటనపై పార్లమెంటు ఉభయ సభల్లో కేంద్రం స్పందించాల్సిందేనని పట్టుబట్టారు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు తాము ఈ ఆందోళనలు ఆపేది లేదని, ఇక్కడి నుంచి కదిలేది లేదని రాహుల్ తేల్చి చెప్పారు. ఆ తర్వాత ఢిల్లీ పోలీసులతో పాటు ఆర్‌పీఎఫ్, ఆర్‌ఏఎఫ్ బలగాలు భారీగా మోహరించి ప్రధాని నివాసం ముందు ధర్నా చేస్తున్న నేతలందరినీ అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. డిమాండ్లపై రాహుల్ మాట మార్చారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ విమర్శించారు. రాహుల్ సహా కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోకముందు మీడియాతో ఆయన మాట్లాడారు. 'నీట్ అంశంపై లోక్‌సభలో చర్చించాలని తొలుత రాహుల్ కోరారు. దానిపై హామీ ఇస్తే ధర్నా విరమిస్తామన్నారు. పార్లమెంట్‌లో చర్చిస్తామని హామీ ఇచ్చాం. ఇప్పుడు మాట మార్చి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో ఇలా మాట మార్చడం సరికాదు. రాహుల్ ప్రవర్తన, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. యాగీ చేయడమే ఆయన ఉద్దేశం. రాజకీయ లబ్ది కోసమే రాహుల్ ప్రయత్నిస్తున్నారు. మా ప్రభుత్వం యువతకు అన్యాయం చేయదు'అని జితేంద్రసింగ్ అన్నారు.

# జిహెచ్ఎంసి ఎన్నికల కోసమే ఇళ్ల నాటకం

**హైదరాబాద్,జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** జీహెచ్ఎంసీ ఎన్నికలు వస్తున్నాయనే ఇళ్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నాటకం ఆడుతోందని బిజెపి దుయ్యబట్టింది. 7వేల ఇళ్లకు 10వేల దరఖాస్తులు వస్తాయి.

ఒక్కో దరఖాస్తుకు రూ.10వేల చొప్పున తీసుకుంటే ప్రభుత్వానికి రూ.వెయ్యికోట్ల రాబడి వస్తుందని, క్యూర్ పేరుతో ప్రజలకు ప్రభుత్వం పెయిన్ తెస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఎద్దేవా చేశారు. నాంపల్లిలో భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

క్యూర్‌లో శాస్త్రీయ బద్ధమైన పన్నుల విధానం లేదు. ట్యాక్స్ దోపిడీతో ప్రజలపై భారం పడుతుంది. ఈ చట్టాన్ని రెసిడెన్షియల్ అసోసియేషన్లు వ్యతిరేకిస్తున్నాయి. ఇది సరైన చట్టం కాదు. ఎవరితోనూ చర్చించకుండా దీన్ని అమలు చేస్తున్నారు. రాజీవ్ స్వగృహ పేరుతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నిర్మించిన ఇళ్లు అలాగే ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేసి పేదలకు ఇవ్వాలి. క్యూర్‌పై వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నాకే చట్టాన్ని అమలు చేయాలన్నారు. రూ.వెయ్యి కోట్ల కోసం పేదల నుంచి రూ.10వేలు తీసుకోవడం సరికాదని రామచందర్‌రావు అన్నారు.

# రైతులను ఆరుతడి పంటలవైపు మళ్లించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎల్‌నినో ప్రభావంపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం తీవ్రత ప్రజలపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలపై దృష్టి పెట్టాలని అన్నారు. రైతులను తక్కువ నీరు అవసరమయ్యే పంటలు, పండ్ల తోటలు, అరుతడి పంటలు సాగు చేసేందుకు ప్రోత్సహించాలని సూచించారు. ఈ దిశగా వ్యవసాయ, ఉద్యాన అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయ, పాడి పరిశ్రమలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఎల్‌నినో బారిన ప్రజలు పడకుండా చూసే బాధ్యత పూర్తిగా జిల్లా యంత్రాంగంపైనే ఉందని స్పీకర్ స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేయాలని, అవసరమైన చోట నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమం చివరలో వర్షపు నీటి సంరక్షణ కు సంబందించిన తెలంగాణ జలసిరి పోస్టర్ విడదల చేశారు. ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, శంకర్, కాలే యాదయ్య ఇంకా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వివిధ విభగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై ఇన్ని అబద్ధాలా?

**హైదరాబాద్,జూలై 21(పిసిడబ్ల్యూ న్యూస్):** కాళేశ్వరం దగ్గర చిల్లర రాజకీయం చేయడంపై సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. మరి దేవాదుల దగ్గర నీకు ఏం అడ్డమొచ్చిందని ప్రశ్నించారు. దేవాదుల విషయంలో నాటి నుంచి నేటి దాకా కాంగ్రెస్ పార్టీది ద్రోహమే అని మండిపడ్డారు. 2011లో మూడేళ్లు దేవాదులను మూలకు పడేసిందే కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. ఎల్‌నినో పేరు చెప్పి ఎగనామం పెడితే బీఆర్ఎస్ ఊరుకోదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి బొట్టును ఒడిసి పట్టాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డికి ఉందని అన్నారు. మాట్లాడితే తిట్లు, ఒట్లు తప్ప ఏమీ లేదని మండిపడ్డారు. మొన్న రాములోరి మీద కూడా ఒట్టు పెట్టిండు అని తెలిపారు. ఒట్ల మీద ఉన్న శ్రద్ధ.. నీటి బొట్ల మీద పెట్టాలని హితవుపలికారు. లేదంటే చరిత్రహీనుడిగా మిగిలిపోవడం ఖాయమని హెచ్చరించారు. నీళ్లు రాకున్నా.. కరెంటు లేకున్నా రేవంత్ రెడ్డిదే బాధ్యత అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. జూన్ 1 నుంచి నేటి వరకు సమ్మక్క బ్యారేజీ నుంచి 105 టీఎంసీల నీరు కిందకు పోయిందని తెలిపారు. నీళ్లన్నీ ఆంధ్రాకు తరలిపోయాయని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం 1.9 టీఎంసీలు మాత్రమే ఎత్తిందని చెప్పారు. నాలుగు రోజులకు ఒక టీఎంసీ ఎత్తవచ్చని.. 50 రోజులకు 12 టీఎంసీలు ఎత్తే అవకాశం ఉందని తెలిపారు. కానీ కనీసం రెండు టీఎంసీలు కూడా ఎత్తలేదని విమర్శించారు. ఇది నేరపూరిత నిర్లక్ష్యం కాదా అని ప్రశ్నించారు. నీ ప్రభుత్వానికి ఏం శిక్ష వేయాలో నువ్వే చెప్పు అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. ఇన్ని నీళ్లు ఉంటే ఎత్తవా అని మండిపడ్డారు. ఇదేనా రైతులపై నీకు ఉన్న చిత్తశుద్ధి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న దేవాదులను నిర్వహించే సత్తా మీకు లేదా అని అడిగారు. మీ వైఫల్యం వల్ల వరంగల్ జిల్లా వ్యవసాయ సంక్షోభంలో మునిగిపోయిందని అన్నారు.




వరంగల్, కరీంనగర్ జిల్లాలు ఆగమయ్యే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కార్ వైఫల్యమే అని ఆరోపించారు. 22 రిజర్వాయర్ల కెపాసిటీ 12 టీఎంసీలు అని.. ప్రతిరోజు పావు టీఎంసీ ఎత్తవచ్చని తెలిపారు. అంటే ఇప్పటికి 12 టీఎంసీలు ఎత్తిపోయవచ్చని పేర్కొన్నారు. మరెందుకు 22 రిజర్వాయర్లు నింపలేదని ప్రశ్నించారు. దేవాదుల నుంచి 105 టీఎంసీలు కిందకు తరలిపోయాయని తెలిపారు. ఈ రోజు కూడా దేవాదులలో 78 మీటర్ల ఎత్తులో నది ప్రవహిస్తున్నదని పేర్కొన్నారు. 73 మీటర్లు ఉంటే చాలు మోటార్లు నడుస్తాయని.. 78 మీటర్లు ఉన్నప్పటికీ మోటార్లు నడిపించడం లేదని చెప్పారు. ఎందుకు నీళ్లు ఎత్తిపోయడం లేదని, ఏమిటీ నిర్లక్ష్యమని ప్రశ్నించారు. అతి తక్కువ వర్షపాతం పడిన జిల్లా వరంగల్ జిల్లా అని హరీశ్‌రావు తెలిపారు. రెయిన్‌ఫాల్ తక్కువ ఉంటే సమ్మక్క బ్యారేజీ నుంచి నీళ్లు ఎత్తడం లేదని పేర్కొన్నారు. ఎందుకు నీళ్లను కిందకు జారవిడుస్తున్నారని ప్రశ్నించారు. మేం ప్రెస్‌మీట్ పెట్టగానే.. దేవాదులలో రెండు మోటార్లు స్టార్ట్ చేశారని తెలిపారు. మేం ప్రశ్నిస్తే తప్ప నీళ్లు ఎత్తిపోయారా అని నిలదీశారు. ప్రధాన ప్రతిపక్షంగా రైతుల పక్షాన బాధ్యతాయుత పోరాటం చేస్తున్నామని మండిపడ్డారు.దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు స్టార్ట్ చేసి సాగునీటిని అందిస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పిన మాటలు నమ్మి రైతులు నారుమడులు పోసుకున్నారని తెలిపారు. ఇప్పుడేమో నీళ్లు ఎత్తడం లేదని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ మాత్రం నీళ్లు ఇవ్వమని చెబుతున్నాడని అన్నారు. మంత్రులది ఒక మాట.. కలెక్టర్‌ది ఒక మాట ఉంటుందా అని మండిపడ్డారు. ప్రపంచమంతా నీళ్లను కాపాడుకుంటే.. మీరు వృథా చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. పాకాల ప్రాజెక్టు కింద 29వేల ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి అక్కడి రైతులు నాట్లు వేసుకున్నారని, రామప్ప కింద కూడా నాట్లు వేసుకున్నారని పేర్కొన్నారు. రామప్ప కింద 5500 ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. నిన్న పాకాల కింద తూములు మూసేశారని పేర్కొన్నారు. నమ్మి నాట్లు వేసుకున్న రైతుల పరిస్థితి ఏంటి అని నిలదీశారు. మంత్రులది ఒక మాట.. కలెక్టర్‌ది ఒక మాట ఉంటుందా అని హరీశ్‌రావు మండిపడ్డారు. రామప్ప కింద తూములు మూసేస్తే రైతుల పరిస్థితి ఏంటని నిలదీశారు. నీళ్లు ఎత్తకుండా కలెక్టర్ ఎందుకు తూములు మూసేయమని చెప్పాడని ప్రశ్నించారు. మంత్రులు చెప్పింది తప్పయితే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. క్రాప్ హాలీడే ప్రకటించి, రైతులకు డబ్బులు ఇవ్వాలన్నారు. పంటను కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడతారని హరీశ్‌రావు తెలిపారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా నీళ్లు పోసి నార్లు కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు. బిందెలు, సీసాలతో పత్తికి బొట్టు బొట్టు నీళ్లు జల్లుకుంటున్నారని చెప్పారు. రైతులకు ఉన్న తపన, సోయి రేవంత్ రెడ్డికి లేదా అని మండిపడ్డారు. నీళ్ల కోసం తెలంగాణ రైతులు ఎంతో తపన పడుతున్నారని తెలిపారు. నీళ్ల ఎత్తిపోతల విషయంలో కూడా వాయిదాలు ఎందుకు అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేక నీళ్లు కిందకు విడిచిపెడుతున్నాడని మండిపడ్డారు.

# దేశ యువత కోసం రాహుల్ పోరాటం

**హైదరాబాద్,జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** యువత భవిష్యత్ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జీకి బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రధాని నివాసం వద్ద ధర్నా చేపట్టారు. ఈ ఆందోళనకు మద్దతు తెలుపుతూ సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ మద్దతుగా నిలిచారని చెప్పారు. యంగ్ ఇండియాకు కాంగ్రెస్ అండగా ఉంటుందని సీఎం పేర్కొన్నారు.

# వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగిందన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షల మంది భక్తులు తరలివచ్చారన్నారు. ప్రత్యేక సమీక్షలు చేసి, ఇచ్చిన ఆదేశాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పట్లు చేయడంతో ఘనంగా కల్యాణం జరిగిందని తెలిపారు. వికలాంగులు, జోగినిలకు ప్రత్యేక క్యూ లైన్స్ ఏర్పాటు చేయడంతో తోపులాట, తొక్కిసలాట జరగలేదన్నారు. జోగినిలకు ప్రాముఖ్యం ఇవ్వడంతో పాటు వారు తెచ్చిన పట్టువస్త్రాలను అమ్మవారికి చేరవేశామని.. వారిని గ్యాలరీలో తమతో సమానంగా కూర్చునేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాల కోసం వరుణయాగం జరుగుతోందన్నారు. నిజాం కాలం నుంచి అమ్మవారికి ప్రాముఖ్యం ఉందన్నారు. అమ్మవారిని దర్శించుకొంటే కోరికలు నేరవేరుతాయని నమ్మకమని చెప్పారు. బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం బ్జడెట్ కేటాయించిందని అన్నారు. ఖర్చుల కోసం దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయాలకు బడ్జెట్ కేటాయించామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. మహిమగల బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం.. లోకకల్యాణం కోసం ఘనంగా జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# ఎల్‌నినో సవాళ్లపై పక్కా ప్రణాళికలు

(మొదటి పేజీ తరువాయి)

నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. పగటి పూట సోలార్ విద్యుత్ వినియోగం పెంచి ఆర్థిక భారం తగ్గిస్తామని చెప్పారు. ఎల్ నినో కారణంగా వర్షాకాలం లోనూ వేసవిలో ఉన్నంత విద్యుత్ డిమాండ్ ఉందని వివరించారు. గ్రిడ్ స్థిరత్వానికి స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాల వారీగా కూడా ఎల్ నినో అవగాహన సదస్సులు నిర్వహించాలనిఉన్నతాధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు.

# ఉద్యమకారులకు వెంటనే న్యాయం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

స్వతంత్ర సైనిక సమ్మాన్, హైదరాబాద్ లిబరేషన్ మూమెంట్ రూల్ పొజిషన్‌ను స్టడీ చేయాలని ఈ సందర్భంగా ఆ కమిటీకి సూచించారు. వాటిలో ఉన్న విధంగా ఉద్యమకారులకు ప్రయోజనం కలిగించాలని స్పష్టం చేశారు. కేకే కమిటీ అంటే కాలయాపన కమిటీ అనే భావన ఉంది.. అది తప్పని నిరూపించాలని ఆ కమిటీ చైర్మన్‌తో ఆమె పేర్కొన్నారు. ఉద్యమకారుల కోసం బీఆర్ఎస్‌లో అంతర్గతంగా పోరాటం చేసి బలైన వ్యక్తిని తానని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తన సూచనలు, సలహాల ద్వారా ఉద్యమకారులకు కొంత మేలు జరిగితే తన జన్మ ధన్యమైనట్లేనని టీఆర్ఎస్ చీఫ్ కవిత తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం పోరాడిన ఉద్యమకారులను గుర్తించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా కె. కేశవరావును నియమించింది.

# సన్న వడ్ల కుంభకోనం గతంలో జరిగిందేమో

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో ఈ కుంభకోణం జరిగి ఉండవచ్చని ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పని పారదర్శకంగా జరుగుతుందని వివరించారు. ధరలు పెంచి టెండర్ కోడ్ చేస్తే.. ఎవ్వరూ ముందుకు రాలేదని అన్నారు. అందుకే మళ్ళీ పిలిచారని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటిపారుదలలో ఎక్స్‌పర్ట్ అయితే.. హరీశ్‌ను మంత్రి పదవి నుంచి కేసీఆర్ ఎందుకు తొలగించారంటూ ఉత్తమ్ కుమార్ రెడ్డి సందేహం వ్యక్తం చేశారు. ముందు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాలంటూ హరీశ్ రావుకు సూచించారు. దేవాదులలో 7 పంపులు నడుస్తున్నాయని.. నేడు మరో రెండు అందుబాటులోకి వస్తాయని అన్నారు. రూ.14 వందల కోట్ల సంగతి ఏమిటో ముందు సమాధానం చెప్పాలంటూ హరీశ్ రావును మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

# ఎల్‌నినో ప్రభావంతో ప్రభుత్వం అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర రవాణా / బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలసి ఎల్‌నీనో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, కంటింజెన్సీ ప్రణాళికల అమలుపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాభావ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారులను నియమించగా, ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేనను నియమించినట్లు తెలిపారు. వ్యవసాయం, తాగునీటి లభ్యత, భూగర్భ జలాలు, వర్షాభావ పరిస్థితులపై ప్రత్యేక అధికారులు నివేదికలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారని చెప్పారు. సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించి అవసరమైన సహాయం కోరనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. కోతుల బెడద నివారణ చర్యలపైనా రైతులకు సూచనలు ఇవ్వాలని అన్నారు.దేవాదుల ప్రాజెక్టు మోటార్లు ప్రతిరోజూ పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఏదైనా లోపం తలెత్తితే 24 గంటల్లో మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవాదుల ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. దేవాదుల, సాగునీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఈ సమన్వయాన్ని ములుగు జిల్లా కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు.

# దరఖాస్తుల గడువు జూలై 31 వరకు పొడిగింపు

**- జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి ముజాహిద్**

**- కుట్టు మిషన్, చిన్న వ్యాపారం, ఈ-బైక్, ఈ-స్కూటీ, మోటార్ బైక్ పథకాల కోసం దరఖాస్తుల స్వీకరణ**

**- జూలై 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం**



**ఖమ్మం ప్రతినిధి, జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 202627 సంవత్సరానికి అర్హులైన క్రిస్టియన్ మైనారిటీల నుంచి స్వయం ఉపాధి పథకాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గడువును జూలై 31 వరకు పొడిగించినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన క్రిస్టియన్ మైనారిటీల నుంచి కుట్టు మిషన్, చిన్న వ్యాపారం, ఈ-బైక్, ఈ-స్కూటీ, మోటార్ బైక్ స్వయం ఉపాధి పథకాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నామని తెలిపారు. దరఖాస్తుదారులు క్రిస్టియన్ మైనారిటీకి చెందినవారై ఉండాలని, పట్టణ ప్రాంతాలకు చెందిన అభ్యర్థుల వార్షిక కుటుంబ ఆదాయం రూ. 2 లక్షల లోపు, గ్రామీణ ప్రాంతాలకు చెందిన అభ్యర్థుల వార్షిక కుటుంబ ఆదాయం రూ. 1.50 లక్షల లోపు ఉండాలని పేర్కొన్నారు. కుట్టు మిషన్, చిన్న వ్యాపారం పథకాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయస్సు 21 నుంచి 55 సంవత్సరాల మధ్య, ఈ-బైక్, ఈ-స్కూటీ, మోటార్ బైక్ పథకాలకు 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని తెలిపారు. అర్హులైన క్రిస్టియన్ మైనారిటీలు జూలై 31 వరకు tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9704003002 మొబైల్ నంబర్‌ను సంప్రదించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్ ఆ ప్రకటనలో కోరారు.

# మల్లంపల్లిలో ఘనంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే 84వ జన్మదిన వేడుకలు




**మల్లంపల్లి మండల ప్రతినిధి జూలై 21: (పిసిడబ్ల్యూ న్యూస్):** మల్లంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీకాంత్ రెడ్డి, మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు ఆధ్వర్యంలో ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే 84వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ, విద్యార్థి నాయకుడిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన మల్లికార్జున్ ఖర్గే అంచెలంచెలుగా ఎదిగి జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఆయన మరెన్నో సంవత్సరాలు ఆయురారోగ్యాలతో ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ అంకం సురేష్, జిల్లా హెల్త్ & మెడికల్ సెల్ వింగ్ చైర్మన్ డాక్టర్ రవిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ చారి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు చిట్టి రెడ్డి రామ్ రెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు మేకల ప్రశాంత్, వనమా శ్రీనివాస్, గుత్తూరు తండా గ్రామ అధ్యక్షుడు జోష్, కక్కెర్ల సాంబయ్య, గొల్లెన సారంగం, కొంగరి నరేందర్, మమ్మద్ మోసిన్, రాజశేఖర్, అంకం మహేందర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రామకృష్ణాపురం రైల్వే గేట్‌కు మోక్షం.. ఆర్వోబి నిర్మాణంపై ముందడుగు

**• ఎంపీ వద్దిరాజు చొరవకు దక్కిన ఫలితం**



**చింతకాని, జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** చింతకాని మండలం రామకృష్ణాపురం సమీపంలోని 107 రైల్వే గేట్ వద్ద రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) నిర్మాణానికి ఎట్టకేలకు అడుగు ముందుకు పడింది. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చొరవ ఫలితంగా ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న సమస్యకు పరిష్కారం లభించింది. దానికి తోడు గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు చేసిన విజ్ఞప్తులు, వివిధ పత్రికలు, సోషల్ మీడియాలో వచ్చిన కథనాలకు స్పందన లభించింది. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ బాబ్జి ప్రసాద్ ఆధ్వర్యంలో రైల్వే రోడ్ సేఫ్టీ అధికారి సుందర్ సేన్, ఇతర అధికారులతో కలిసి రామకృష్ణాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆర్వోబి నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ అంశం.. గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆమోదం తదితర అంశాలపై సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ గాదె నాగలక్ష్మి, ఉపసర్పంచ్ గాదె రామారావు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే రోడ్ సేఫ్టీ అధికారి సుందర్ సేన్ మాట్లాడుతూ.. ఆర్‌ఓబీ నిర్మాణానికి అవసరమైన ప్రక్రియలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. నిర్మాణం కోసం భూములు కోల్పోయే రైతులు పూర్తి సహకారం అందించాలని కోరారు. భూమి కోల్పోయిన రైతులకు ప్రభుత్వం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం తగిన పరిహారం అందజేస్తామని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఈ ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. త్వరలోనే సర్వే పనులు ప్రారంభించి నిర్మాణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. గ్రామంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరిస్తే ఆర్‌ఓబీ నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**ఎంపీ వద్దిరాజు కృషి..** రామకృష్ణాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం గ్రామస్తులంతా ఏడాది క్రితం ఎంపీ వద్దిరాజు రవిచంద్రను కలిసి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు రవిచంద్ర స్పందించి ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆ సందర్భంగా రామకృష్ణాపురం వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ఆవశ్యకత గురించి మంత్రికి వివరించారు. ఆ మేరకు కొద్ది రోజులకే రైల్వే మంత్రి స్పందించి ఎంపీ రవిచంద్ర కు లేఖ రాశారు. బ్రిడ్జి నిర్మాణ అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, దీనిపై తొందరలో సముచిత నిర్ణయం తీసుకుంటామని హామీ ఇస్తూ మంత్రి అశ్విని వైష్ణవ్ హామీ ఇచ్చారు. ఆ మేరకు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రిత్వ కార్యాలయం నుంచి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రామకృష్ణాపురం గ్రామస్తులు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కు కృతజ్ఞతలు తెలిపారు.

# సేక్రెడ్ హార్ట్ స్కూల్‌లో ప్రజాస్వామ్య పద్ధతిలో విద్యార్థి నాయకుల ఎన్నికలు

**• హెడ్ బాయ్, హెడ్ గర్ల్‌లుగా విద్యార్థుల ఎన్నిక గెలుపొందిన వారినీ యాజమాన్యం అభినందనలు**










**ఖమ్మం, ప్రతినిధి జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** సేక్రెడ్ హార్ట్ ఈఎం హై స్కూల్‌లో విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించే ఉద్దేశంతో విద్యార్థి నాయకుల ఎన్నికలను సోమవారం క్రమశిక్షణతో నిర్వహించారు. చిన్నతనం నుంచే ఎన్నికల విధానం, ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించేలా బ్యాలెట్ పేపర్ ద్వారా పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులు క్యూలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకోగా, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్స్‌లో ఓట్లు వేశారు. ఎన్నికల ఫలితాల్లో హెడ్ బాయ్‌గా డి. తేజేశ్వర్ నాయక్ 26 ఓట్లతో, వైస్ హెడ్ బాయ్‌గా ఎం. అభిరామ్ తేజ 26 ఓట్లతో విజయం సాధించారు. హెడ్ గర్ల్‌గా ఎం. లాస్య 28 ఓట్లతో, వైస్ హెడ్ గర్ల్‌గా జి. లహరి 19 ఓట్లతో ఎన్నికయ్యారు. విజేతలందరూ 9వ తరగతి విద్యార్థులే. ఈ ఎన్నికలకు పీటీ ఉపాధ్యాయులు ఎం. సుధాకర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, సిస్టర్ జెస్సీ పర్యవేక్షించారు. ఎన్నికల ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించారు. ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ స్టెఫీ, కరస్పాండెంట్ సిస్టర్ మంజుతో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించి, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

# మహిళా ఉద్యోగిని వేధిస్తున్న ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లపై వెంటనే చర్యలు తీసుకోవాలి: అబ్దుల్ రెహమాన్



**కరీంనగర్, జూలై 21(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగిని లైంగిక వేధింపులకు గురిచేస్తున్న ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని మాజీ యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్ ప్రశ్నించారు. ఈ అంశంపై నగరపాలక సంస్థ కమిషనర్, మేయర్ ప్రజలకు వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల భర్తను కోల్పోయిన బాధలో ఉన్న మహిళ, కారుణ్య నియామకం ద్వారా నగరపాలక సంస్థలో ఉద్యోగంలో చేరిందని ఆయన తెలిపారు. అయితే అదే కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు ఆమెను కొంతకాలంగా లైంగికంగా వేధిస్తున్నారని ఆరోపించారు. ఆఫీసులో అసభ్యంగా ప్రవర్తించడం, ఫోన్ చేసి బయటకు రావాలని ఒత్తిడి చేయడం, తమతో కలవకపోతే ఉద్యోగం పోతుందని బెదిరించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఒంటరిగా ఉన్న మహిళను లక్ష్యంగా చేసుకుని మానసికంగా వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ వేధింపులు భరించలేక బాధిత మహిళ ఈ నెల 13న నగరపాలక సంస్థ కమిషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కమిషనర్ విచారణకు ఆదేశించినప్పటికీ ఇప్పటివరకు సంబంధిత ఉద్యోగులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆందోళనకరమని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనే మహిళలకు భద్రత లేకపోతే సాధారణ మహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించిన అబ్దుల్ రెహమాన్, ఈ ఘటనపై సమగ్ర, నిష్పాక్షిక విచారణ జరిపి ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లపై కఠిన శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే వారిని సేవల నుంచి తొలగించాలని కోరారు. భవిష్యత్తులో ఏ మహిళా ఉద్యోగిపై ఇలాంటి వేధింపులు పునరావృతం కాకుండా నగరపాలక సంస్థలో మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులపై లాఠీ-ఛార్జీ అమానుషం ప్రధాని మోడీ బాధ్యత వహించాలి: డా. కొరిపల్లి శ్రీనివాస్



**ఖమ్మం, ప్రతినిధి జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పేపర్ లీకేజీ వ్యవహారంపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు, వ్యవస్థాపకులు డా. కొరిపల్లి శ్రీనివాస్ (దళితరత్న) తెలిపారు. పేపర్ లీకేజీ అంశంలో న్యాయం కోరుతూ విద్యార్థులు చేపట్టిన నిరసనను అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం బలప్రయోగానికి పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు. విద్యార్థుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిందిపోయి లాఠీఛార్జ్ చేయించడం అమానుష చర్య అని పేర్కొన్నారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ వెంటనే రాజీనామా చేయాలని డా. కొరిపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అలాగే పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం, కేంద్ర విద్యాశాఖ విద్యార్థులకు జరిగిన అన్యాయంపై సమాధానం చెప్పాలని కోరారు. లాఠీఛార్జ్‌లో గాయపడిన విద్యార్థులకు ప్రభుత్వం తక్షణమే మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులపై బలప్రయోగం కాకుండా రాజ్యాంగబద్ధమైన చర్చల ద్వారా సమస్యకు పరిష్కారం చూపాలని సూచించారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు రాజ్యాంగబద్ధంగా దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని డా. కొరిపల్లి శ్రీనివాస్ హెచ్చరించారు.

# 21వ డివిజన్ వికలాంగుల కాలనీలో రూ.19 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

**వికలాంగులకు అన్ని మౌలిక వసతులు, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పిస్తాం నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్ జిల్లా జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని 21వ డివిజన్ వికలాంగుల కాలనీలో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ. 19 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, వికలాంగుల కాలనీలో నివసిస్తున్న ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సౌకర్యాలు, అవసరమైన అన్ని మౌలిక వసతులను దశలవారీగా కల్పించేందుకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తూ నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ వరాల నర్సింగం, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మున్సిపల్ అధికారులు, వికలాంగుల సంఘ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలి

**- బ్లాక్‌స్పాట్లలో శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలి**

**- జాతీయ రహదారులపై ఆక్రమణలు, అక్రమ ప్రవేశ మార్గాలను పూర్తిగా తొలగించాలి**

**- ప్రతి నెల మూడవ శుక్రవారం జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించాలి**

**- రోడ్డు భద్రతపై రవాణ శాఖ కమీషనర్ ఇల్లంబర్తి నిర్వహించిన వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్**





**ఖమ్మం ప్రతినిధి, జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టి జాతీయ రహదారులపై రోడ్డు భద్రతా ప్రమాణాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర రవాణశాఖ కమీషనర్ ఇల్లంబర్తి హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమీషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం జాతీయ రహదారులపై రోడ్డు భద్రత చర్యలు, ప్రమాదాల నివారణ, సుప్రీంకోర్టు మార్గదర్శకాల అమలు, అనుసరణ (కంప్లయన్స్) నివేదికల సమర్పణ, ప్రమాదాల తగ్గింపునకు తీసుకోవాల్సిన చర్యలు, జాతీయ రహదారుల వెంట ఉన్న ఆసుపత్రుల మ్యాపింగ్, ఆక్రమణల తొలగింపు, అత్యవసర స్పందన వ్యవస్థ, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఖమ్మం పోలీస్ కమీషనరేట్ కార్యాలయం నుండి సిపి సునీల్ దత్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్... సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ... జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను ఇప్పటికే గుర్తించినవి, ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు, క్రిటికల్ జంక్షన్లలో అవసరమైన రోడ్డు భద్రతా పనులను తక్షణమే చేపట్టాలని సూచించారు. జిల్లా పరిధిలోని జాతీయ రహదారుల వెంట వాహనాల కోసం అవసరమైన పార్కింగ్ ప్రాంతాలు, ప్రతి 40 నుంచి 50 కిలోమీటర్లకు ఒకసారి ప్రజలకు అవసరమైన పార్కింగ్, మరుగుదొడ్లు, ఇతర వే సైడ్ సదుపాయాల వివరాలతో కూడిన అనుసరణ నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రతి ట్రాఫిక్ ఉల్లంఘనను నమోదు చేసి నిబంధనల ప్రకారం జరిమానాలు విధించే వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. పెట్రోలింగ్ వాహనాలు అందుబాటులో ఉంచి, జాతీయ రహదారులపై అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన అందించాలని, అంబులెన్స్ సేవలు కూడా దానికి అనుసంధానమై ఉంచాలని తెలిపారు. జాతీయ రహదారు లకు సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల మ్యాపింగ్ పూర్తిస్థాయిలో ఉండాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై ఉన్న ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలని, జాతీయ రహదారులకు అక్రమంగా ప్రవేశ మార్గాలు కల్పిస్తున్న దాబాలు, వాణిజ్య సంస్థలు, ఇతర నిర్మాణాలను కేంద్ర జాతీయ రహదారుల చట్టం ప్రకారం తొలగించాలని సూచించారు. జాతీయ రహదారుల సేఫ్టీ జోన్ పరిధిలో ఎలాంటి వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో గుర్తించిన బ్లాక్‌స్పాట్లను శాశ్వతంగా సరిదిద్దేందుకు అందుబాటులో ఉన్న నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని కలెక్టర్ సూచించారు. బ్లాక్‌స్పాట్ల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను పోలీసుశాఖతో సమన్వయం చేసుకుని వెంటనే సిద్ధం చేసి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్‌హెచ్‌ఏఐ, రోడ్లు-భవనాల శాఖ అధికారులు ఏటీఎంలు (అడ్వాన్స్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ సిస్టమ్), ఆక్రమణలు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ ప్లాన్, లే-బైలు, వే సైడ్ అమెనిటీస్, బ్లాక్‌స్పాట్లు తదితర అంశాలపై చేపట్టిన చర్యలకు సంబంధించిన సమగ్ర అనుసరణ నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. ఇకపై ప్రతి నెల మూడవ శుక్రవారం జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని తప్పని సరిగా నిర్వహించి రోడ్డు భద్రత చర్యల పురోగతిని సమీక్షించాలని, ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనాలకోట రామారావు, నేషనల్ హైవే పిడి దివ్య, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిన కేంద్ర ప్రభుత్వం..

**ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే తొలగించాలని పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ డిమాండ్.**

**నీట్ పరీక్ష రద్దుపై కేంద్రంపై పిడిఎస్యు తీవ్ర విమర్శలు.**

**కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలి.**

**పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్.**

**విద్యార్థుల మరణాలకు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ.**

**బాధిత కుటుంబాలకు రూ. కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్.**



**మహబూబాబాద్, జూలై 21 పి.సి.డబ్ల్యూ న్యూస్:** నీట్ పరీక్ష రద్దు వ్యవహారం దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలను తీవ్ర అనిశ్చితిలోకి నెట్టిందని, దీనికి పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని పిడిఎస్యు తెలంగాణ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ ఆరోపించారు. నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన వైఫల్యాలు, ప్రశ్నాపత్రం లీక్ ఘటనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని, లేకపోతే కేంద్ర ప్రభుత్వం ఆయనను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది విద్యార్థులు ఎంతో శ్రమించి, లక్షల రూపాయలు ఖర్చు చేసి, సంవత్సరాల పాటు కఠినంగా సిద్ధమై నీట్ పరీక్ష రాశారని తెలిపారు. అలాంటి పరీక్షను ప్రశ్నాపత్రం లీక్ పేరుతో రద్దు చేయడం వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని, వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. నీట్ పరీక్ష రద్దు కారణంగా ఇప్పటివరకు 20 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆరోపిస్తూ, ఆ మరణాలకు కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహించాలని పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువజన సంఘాలు గత రెండు నెలలుగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద సామాజిక కార్యకర్త సోనం వాంగ్‌చుక్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను కూడా ప్రభుత్వం పట్టించుకోలేదని, చర్చలకు ముందుకు రాకుండానే ఆ దీక్షను భగ్నం చేసిందని ఆరోపించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనను వ్యక్తం చేస్తున్న విద్యార్థుల స్వరాన్ని అణిచివేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఢిల్లీలో పార్లమెంట్ వరకు చేపట్టిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్న వేలాది విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జి చేయడం, భాష్పవాయు గోళాలు ప్రయోగించడం, అనేక మందిని గాయపరచడం, వందలాది మందిపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన అని విమర్శించారు. సిజేపీ వ్యవస్థాపక సభ్యుడు అభిజిత్ దీప్తేను అరెస్టు చేసి ఎక్కడ ఉంచారో కూడా వెల్లడించకపోవడం ఆందోళనకరమని అన్నారు. జరిగిన తప్పిదాలకు బాధ్యత వహించాల్సిన కేంద్ర ప్రభుత్వం బాధితులపైనే నిందలు మోపుతూ నిర్బంధ చర్యలకు పాల్పడుతోందని పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ ఆరోపించారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ నిరుద్యోగ యువత భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కో వాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మొండివైఖరిని వీడి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని, నీట్ పరీక్ష రద్దు కారణంగా మరణించారని పేర్కొన్న 20 మంది విద్యార్థుల కుటుం బాలకు రూ.1 కోటి చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాం డ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘా ల ఆధ్వర్యంలో మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతా మని పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ హెచ్చరించారు.



# నీట్ లీకేజీపై కేంద్రానికి సీపీఐ హెచ్చరిక

**• ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి: విద్యార్థులపై లాఠీచార్జీ ప్రజాస్వామ్యానికి మచ్చ: దండి సురేష్**

**ఖమ్మం, ప్రతినిధి జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, దీనిపై సమాధానం చెప్పాల్సిన కేంద్ర ప్రభుత్వం నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, యువతపై లాఠీచార్జీకి పాల్పడడం అత్యంత దుర్మార్గమని ఆయన విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనతో పాటు ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జీని నిరసిస్తూ మంగళవారం ఖమ్మం బైపాస్ రోడ్డులో సీపీఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, ప్రశ్నించిన వారిపై పోలీసులతో దాడులు చేయించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. ఢిల్లీలో జరిగిన లాఠీచార్జీ ఘటనపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజల గొంతును అణచివేసే ప్రయత్నాలు ఎంతకాలం సాగవని, ప్రజాస్వామ్యంలో ప్రజల ప్రశ్నించే హక్కును ఎవరూ హరించలేరని పేర్కొన్నారు. రాస్తారోకో కారణంగా బైపాస్ రోడ్డుపై కొంతసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, అజ్మీర రామ్మూర్తి, మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రక్షాళన (ఎస్ఐఆర్)పై బీజేపీ రివ్యూ....

**నగరంలోని 40 డివిజన్లలో జరిగిన ఓటరు జాబితా ప్రక్షాళన ప్రక్రియ పై విస్తృతంగా సమీక్ష...**

**సమీక్ష సమావేశంలో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నగర మేయర్ కోలగాని శ్రీనివాస్ , డిప్యూటీ మేయర్ సునీల్ రావు...**




**కరీంనగర్ జిల్లా జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని 40 డివిజన్లలో ఓటరు జాబితా ప్రక్షాళన, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమంపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో మంగళవారం రోజున కీలక సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నగర మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాస్ తో పాటు వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, ఇన్చార్జులు, జోన్ అధ్యక్షులు, పోలింగ్ బూత్ బాధ్యులు, బిఎల్ఎ 2లు, శక్తి కేంద్ర ఇన్చార్జులు, ముఖ్య నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నగర పరిధిలోని అన్ని డివిజన్లలో ఓటరు జాబితాలో ఓట్ల నమోదు, డూప్లికేట్ ఓట్ల వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో జరిగిన పరిశీలనను నాయకులు సమీక్షించారు. అర్హులైన ప్రతి ఒక్క యువతీయువకుడికి ఓటు హక్కు కల్పించే దిశగా బూత్ స్థాయి కార్యకర్తలు మరింత చురుగ్గా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. జాబితాలో ఎటువంటి లోపాలు లేకుండా చూసే బాధ్యత కార్యకర్తలదేనని స్పష్టం చేశారు. "ప్రజాస్వామ్యంలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా, అనర్హుల పేర్లు చేరకుండా పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. నగర అభివృద్ధిలోనూ, ప్రజాస్వామ్య పరిరక్షణలోనూ ప్రతి ఓటూ కీలకమేనని , 40 డివిజన్లలో పార్టీ శ్రేణులు చేపట్టిన ఈ ప్రక్షాళన కార్యక్రమం విజయవంతంగా కొనసాగడం సంతోషకరమైన పరిణామని నగర మేయర్ కోలగాని శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, జోన్ అధ్యక్షులు , డివిజన్ బాధ్యులు, ప్రధాన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ డివిజన్లలోని ఓటరు జాబితా స్థితిగతులను ఈ సందర్భంగా పార్టీ నాయకత్వానికి వివరించారు.

# ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం: నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

### కరీంనగర్ సిటీ ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్, హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహణ



**కరీంనగర్ జిల్లా జూలై 21(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ సిటీ ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్ మరియు హెల్త్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు సమాజంలోని ప్రతి శుభకార్యంలో కీలక పాత్ర పోషిస్తూ అహర్నిశలు శ్రమిస్తున్నారని, వారి సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవడానికి ఇటువంటి వర్క్‌షాప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. వృత్తిపరమైన సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు ఐకమత్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఫోటోగ్రాఫర్ల సంక్షేమం కోసం పనిచేస్తున్న వెల్ఫేర్ అసోసియేషన్‌కు తమ పూర్తి సహకారం ఉంటుందని మేయర్ హామీ ఇచ్చారు. అసోసియేషన్‌కు సొంత స్థలం ఉన్నట్లయితే మున్సిపల్ బడ్జెట్ ద్వారా నిధులు కేటాయించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. అలాగే అర్హులైన సభ్యులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు ఇతర ప్రయోజనాలు అందేలా తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.



ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు మరియు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. అనారోగ్య సమయంలో ఆర్థిక భరోసా కల్పించే ఈ కార్యక్రమం ఎంతో ఆదర్శప్రాయమని, దీని ద్వారా అనేక కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని మేయర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, అతిథులు వెంకన్న, శ్రీనివాస్ గౌడ్, సీతారెడ్డి, శ్రీకాంత్, నాగేష్, కౌశిక్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ విజయవంతానికి సహకరించిన మహా గణేష్ ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధులకు, కరీంనగర్ సిటీ ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులకు నగర మేయర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఎలినోనా ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

- ఉమ్మడి వరంగల్ జిల్లాల అధికారులకు మంత్రి పొంగులేటి, మంత్రి పొన్నం దిశానిర్దేశం సమీక్షలో పాల్గొన్న ప్రభుత్వ విప్ డా. రామచంద్ర నాయక్




**వరంగల్, ప్రతినిధి జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఎలినోనా ప్రభావంతో సంభవించే వాతావరణ మార్పులు, భారీ వర్షాలు, ప్రకృతి విపత్తుల నేపథ్యంలో ముందస్తు చర్యలపై అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ సూచించారు. వరంగల్‌లో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎలినోనా ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం చేపట్టాల్సిన చర్యలు, విపత్తు నిర్వహణ, ప్రజల భద్రత, తాగునీరు, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు, సహాయక బృందాల సిద్ధత, లోతట్టు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సమగ్రంగా చర్చించారు. ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్ర నాయక్ మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని అధికారులను కోరారు. ప్రజలకు అవసరమైన సహాయ చర్యలు ఎప్పటికప్పుడు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా ప్రత్యేకాధికారి దేవసేనతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొని, తమ జిల్లాల్లో చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లపై వివరాలు వెల్లడించారు. ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాల మేరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు.

# నా కూతురిని నాకు అప్పగించండి.....

- కారేపల్లి పోలీసులు పట్టించుకోవడం లేదు....
- న్యాయం చేయాలని వేడుకున్న తల్లి గుగులోత్ సుజాత




**ఖమ్మం, ప్రతినిధి జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** మే 31 నుండి తన కూతురు కనిపించడం లేదని, పోలీసులకు పిర్యాదు చేసినా ఇంతవరకూ ఆచూకీ తెలుసుకోలేదని, వెంటనే న్యాయం చేయాలని తల్లి గుగులోత్ సుజాత వేడుకుంది. ఖమ్మం లోని ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.... గతంలో ఒక సారి బాణోత్ ముఖేష్ అనే యువకుడు తన పాపను తీసుకెళ్తే వెతుకులాడి తీసుకొచ్చామని తెలిపింది. మళ్ళీ తన పాపకు మాయ మాటలు చెప్పి తీసుకెళ్లాడని, ఇంతవరకూ ఆచూకీ లేదని పేర్కొంది. ముఖేష్ మాత్రం ఉరిలోనే ఉన్నాడని, మేము ఎక్కడ వెతికినా పాప ఆచూకీ తెలియడం లేదని, ఈ విషయంపై కారేపల్లి పోలీసుకులకు పిర్యాదు చేశామని తెలిపింది. పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నామని, పట్టించుకోవడం లేదని తెలిపింది. పోలీసులు వెంటనే చర్యలు తీసుకుని పాప ను తమకప్పగించాలని వేడుకుంది. ఈ సమావేశంలో బాణోత్ మల్సూర్, బాణోత్ సరోజ పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ ఫీస్‌లో 25% రాయితీతో చెల్లింపు

### దరఖాస్తుదారులకు చివరి అవకాశం
### ఉపయోగించుకోండి
### మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణారెడ్డి



**కల్లూరు, జులై 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రాష్ట్రంలోని ప్లాట్ల అనధికార లేఅవుట్ లో ప్లాట్ కొనుగోలు చేసిన ప్లాట్ యజమానులకు తెలంగాణ ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ జి సాయి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం ఫీజుల చెల్లింపులపై 25 శాతం రాయితీని ప్రకటిస్తూ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది అని తెలిపారు. ఎల్ఆర్ఎస్ 2020 కింద దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్లాట్ యజమానులకు మాత్రమే ఈ వెసులుబాటు కల్పించిన ప్రభుత్వం 2026 మే 1 నుంచి జులై 31వ తేదీ వరకు మూడు నెలల కాలంలో ఫీజు చెల్లించే వారికి మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుంది అని అన్నారు. కల్లూరు మునిసిపాలిటీ లో ఈ స్కీమ్ క్రింద 1851 మంది దరఖాస్తు చేసుకోగా 1747 మందికి ఫీస్ చెల్లించమని ఆన్లైన్ లో సమాచారం పంపగా అందులో కేవలం 289 మాత్రమే ఫీస్ చెల్లించారని అన్నారు. ఫీస్ చెల్లించిన వారికి అప్లికేషన్ పరిశీలించి ఇప్పటికే 180మంది ప్రొసీడింగ్ ఇవ్వటం జరిగింది అని మిగిలిన 1562 దరఖాస్తు దారులు ఈ 25% ఫీస్ రాయితీ ఉపయోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణ రెడ్డి తెలిపారు. మీరు చెల్లించ వలసిన ఫీస్ వివరాలు వెబ్సైట్ లో మీరు దరఖాస్తు చేసుకున్న ఫోన్ నెంబర్ తో సిటిజన్ లాగిన్ లో తెలుసుకోవచ్చు అని టౌన్ ప్లానింగ్ అధికారి మల్లేష్ తెలిపారు. పూర్తి వివరాలు తెలుసుకోవడానికి మున్సిపల్ కార్యాలయంలో సంప్రాంచించాలని మేనేజర్ నందిశెట్టి నాగేశ్వర్ రావు తెలిపారు.

# మంత్రి వివేక్‌ను కలిసిన కవ్వంపల్లి..



**హైదరాబాద్ జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం రాష్ట్ర కార్మిక, ఉపాధి, భూగర్భ గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని మానకొండూరు ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మానకొండూరు నియోజకవర్గానికి సంబంధించిన పలు అభివృద్ధి అంశాలు, ప్రజా సమస్యలు, కార్మికులు, ఉపాధికి సంబంధించిన అంశాలపై మంత్రితో ఎమ్మెల్యే సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరగా, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యకాండ

- కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి నశించాలి
- మోడీ మౌనం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం
- కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి
- జార్జిరెడ్డి పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు మంద సురేష్




**ఖమ్మం ప్రతినిధి, జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నీట్ పరీక్ష లీక్ ద్వారా దేశవ్యాప్తంగా విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఢిల్లీలోని పార్లమెంటు భవనంవద్ద ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన కార్యక్రమం చేపడుతున్న విద్యార్థులపై లాఠీలతో విచక్షణ రహితంగా పోలీసులు చేసిన దౌర్జన్యకాండ దుర్మార్గమైనదని జార్జిరెడ్డి పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు మంద సురేష్ అన్నారు. మంగళవారం ఖమ్మం నగరంలోని నయాబజార్ కళాశాల, కాలవొడ్డు సెంటర్లో విద్యార్థులపై పోలీసుల దాడిని నిరసిస్తూ, కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరికి నిరసనగా జార్జిరెడ్డి పిడిఎస్యు ఆధ్వర్యంలో నిరసనర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు మంద సురేష్ మాట్లాడుతూ... ఢిల్లీలో శాంతియుతంగా నిర్వహిస్తున్న "మార్చ్ టు పార్లమెంట్" కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జ్ చేయడం, భాష్పవాయువు (టియర్ గ్యాస్) ప్రయోగించడం ప్రజాస్వామ్య హక్కులపై జరిగిన దాడి అని అన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు నీట్ స్కాంపై తమ సమస్యల పరిష్కారంకోసం శాంతియుతంగా నిరసనలు చేపడుతుంటే, వారి గొంతును అణచివేసేందుకు పోలీసు బలగాలను ఉపయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. విద్యార్థులపై బలప్రయోగం చేయడం కాకుండా, వారి సమస్యలను చర్చించి పరిష్కరించే దిశగా ప్రభుత్వాలు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష స్కాం కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఢిల్లీలో జరిగిన లాఠీచార్జ్‌కు బాధ్యులైన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే ప్రతి చర్యను జార్జిరెడ్డి పిడిఎస్యు తీవ్రంగా ప్రతిఘటిస్తుందని, దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలతో కలసి ఐక్యంగా పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జార్జిరెడ్డి పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, జిల్లా గర్ల్స్ కన్వీనర్ పైండ్ల శ్యామల, ఖమ్మం జిల్లా కమిటీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



# అక్రిడిటేషన్ కార్డుల జారీలో జాప్యంపై కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల ధర్నా..



**రాజన్న సిరిసిల్ల, జూలై 21(పిసిడబ్ల్యూ న్యూస్):** అక్రిడిటేషన్ కార్డుల జారీలో తీవ్ర జాప్యం జరుగుతుండటాన్ని నిరసిస్తూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (TUWJ`H143) ఆధ్వర్యంలో మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా మాట్లాడుతూ, అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నప్పటికీ కార్డులు జారీ కాకపోవడంతో జర్నలిస్టులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అక్రిడిటేషన్ కార్డుల కోసం విలేకరులు అధికారుల చుట్టూ తిరుగుతూ అడుక్కునే పరిస్థితి ఏర్పడటం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఈ జాప్యం కొనసాగుతోందని అన్నారు. వారం రోజుల్లో అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను పూర్తి చేయాలని, లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో పాల్గొన్న జర్నలిస్టులు వెంటనే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని నినాదాలు చేస్తూ ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

# "సఫాయి అప్నావో బీమారీ భగావో" పోస్టర్ ఆవిష్కరించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

## జూలై 31 వరకు నగరవ్యాప్తంగా ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

### సీజనల్, అంటువ్యాధుల నివారణకు ప్రజల భాగస్వామ్యంతో విస్తృత చర్యలు

**కరీంనగర్ జిల్లా జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** వర్షాకాలంలో సీజనల్, అంటువ్యాధులను నివారించడమే లక్ష్యంగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "సఫాయి అప్నావో బీమారీ భగావో" ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మంగళవారం కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, మరియు పారిశుధ్య పర్యావరణ శాఖ అధికారులతో కలిసి కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలై 31 వరకు నగరవ్యాప్తంగా ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పలు ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, నగరంలో రోజువారీ పారిశుధ్య పనులను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్నామని తెలిపారు. నగర ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, సంక్షేమ సంఘాల భాగస్వామ్యంతో జీ.వి.పి. పాయింట్లు, మార్కెట్లు, బస్టాండ్, రైల్వే స్టేషన్‌లు, ఇతర ప్రజా ప్రదేశాల్లో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి తొలగించడం, చెత్తాచెదారం పూర్తిగా తొలగించడం, డ్రైనేజీల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను శుభ్రం చేయడం, దోమల నివారణ కోసం యాంటీ లార్వా ఆపరేషన్లు, ఫాగింగ్, స్ప్రేయింగ్ వంటి చర్యలను విస్తృతంగా చేపడతామని తెలిపారు.కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ కమ్యూనికేషన్ కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, వెల్ఫేర్ గ్రూపులు, హోటల్, రెస్టారెంట్, మార్కెట్ అసోసియేషన్‌లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి నగర పరిశుభ్రత, సోర్స్ లెవల్ సెగ్రిగేషన్, చేతులు శుభ్రంగా కడుక్కోవడం, వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.నగరంలోని డ్రైనేజీలు, పెద్ద నాలాలు, కాలువలు,



ఓపెన్ ప్లాట్లను పూర్తిగా శుభ్రపరచి వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెరువులు, కుంటల పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని చెప్పారు.పారిశుధ్య కార్మికులకు వ్యర్థాల వేరు చేయడం, డోర్ టు డోర్ చెత్త సేకరణ, సెగ్రిగేషన్, పీపీఈ కిట్ల వినియోగంపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్యంగా స్లమ్ ప్రాంతాల్లో 100 శాతం డోర్ టు డోర్ చెత్త సేకరణ, మెరుగైన పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.పబ్లిక్, కమ్యూనిటీ మరుగుదొడ్ల నిర్వహణను మెరుగుపరచడంతో పాటు వాటి మరమ్మతులు చేపట్టి పరిశుభ్రంగా ఉంచుతామని, వాటి వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.నగరంలోని పార్కులు, హెరిటేజ్ ప్రాంతాలు, స్ట్రీట్ ఫుడ్ జోన్‌లు, మార్కెట్ ప్రాంతాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు."నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరమైన నగరంగా తీర్చిదిద్దడంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం ఎంతో కీలకం. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. జూలై 31 వరకు నిర్వహించే ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌లో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలి. కరీంనగర్‌ను క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి" అని మేయర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కమిషనర్లు ఆయాజ్, సువార్త, అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్, డీఈ లచ్చిరెడ్డి, వెటర్నరీ అధికారి దుర్గాప్రసాద్ రెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్లు స్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జీవో నెంబర్ 103ను రద్దు చేసి, పాత విధానంలోనే పదోన్నతులు కల్పించాలని మంత్రి ఫరూక్‌కు సీఐల వినతి

**నంద్యాల, జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెంబర్ 103 వల్ల పోలీసు అధికారులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, వెంటనే దానిని రద్దు చేసి పాత విధానం (జీవో నెంబర్ 54) ప్రకారమే పదోన్నతులు కల్పించాలని ఉమ్మడి కర్నూలు జిల్లా సర్కిల్ ఇన్స్పెక్టర్లు అన్నారు . ఈ మేరకు మంగళవారం రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని కలిసి సిఐల బృందం ఒక వినతి పత్రాన్ని సమర్పించింది.ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ గతంలో పోలీసు పదోన్నతులు, బదిలీలు జోన్ల వారీగా నాలుగు విభాగాలుగా సాగేవని అన్నారు . మే 14 వ తేదీన ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 54 ప్రకారం.. డి.ఎస్.పి స్థాయి పదోన్నతులు రాష్ట్రస్థాయి పరిధిలో, సిఐ పదోన్నతులు జోనల్ పరిధిలో ఉండేలా నిర్ణయించారన్నారు. జూలై 15 న ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త జీవో నెంబర్ 103 ద్వారా పాత నాలుగు జోన్లను రద్దు చేసి, రాష్ట్రస్థాయిలో మల్టీ లెవెల్ జోన్-1, మల్టీ లెవెల్ జోన్-2 లుగా విభజించారని వారు తెలిపారు. ఈ కొత్త విధానం వల్ల ఉమ్మడి రాయలసీమ జిల్లాలైన కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు తో పాటు ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పనిచేసే ఎస్పైలు, సిఐలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని అన్నారు.**ఉదాహరణను వివరిస్తూ:** ఒకే



తేదీన ఇద్దరు అధికారులు ఎస్సైలుగా బాధ్యతలు చేపట్టినప్పటికీ.. మల్టీ లెవెల్ జోన్-1 లో ఉన్న అధికారికి త్వరగా పదోన్నతి లభించి సీఐగా, ఆపై డీఎస్పీగా ఎదిగే అవకాశం ఉంటుందని, అదే సమయంలో మల్టీ లెవెల్ జోన్-2 లో ఉన్న అధికారి సీఐ స్థాయిలోనే నిలిచిపోయే ప్రమాదం ఉందని అధికారులు మంత్రి ఫరూక్ కి వివరించారు. ఈ వ్యత్యాసాల వల్ల సీనియారిటీ ఉన్నప్పటికీ పదోన్నతుల్లో తీవ్ర వెనుకబాటుకు గురికావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.కావున, పోలీసు అధికారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, తీవ్ర నష్టం చేకూర్చే జీవో నెంబర్ 103 ను తక్షణమే రద్దు చేయాలని వారు కోరారు. గతంలో ఉన్న సక్రమమైన పాత విధానం ద్వారానే తమకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమస్యపై ముఖ్యమంత్రి, ఉన్నతాధికారులు మానవతా దృక్పథంతో స్పందించి, పోలీసు సిబ్బందికి న్యాయం చేయాలని ఉమ్మడి కర్నూలు జిల్లా పోలీసు అధికారులు కోరారు . వినతి పత్రం సమర్పించిన వారిలో పలువురు సర్కిల్ ఇన్స్పెక్టర్లు, పోలీసు సంఘాల ప్రతినిధులు ఉన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ గారు మాట్లాడుతూ జీవో నెంబర్ 103 వల్ల మల్టీ లెవెల్ జోన్ల విభజనతో రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల ఎస్సైలు, సిఐలకు జరుగుతున్న ప్రమోషన్ల వ్యత్యాసాలను, సీనియారిటీ నష్టాన్ని అధికారులు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. పోలీసు సిబ్బందిలో ఎలాంటి అసంతృప్తి ఉన్నా అది విధి నిర్వహణపై ప్రభావం చూపుతుందని, అందుకే ఈ జీవో పరమైన లోపాలను తక్షణమే గౌరవ ముఖ్యమంత్రి దృష్టికి అలాగే సంబంధిత ఉన్నతాధికారుల వద్దకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అందరికీ సమానంగా, న్యాయబద్ధంగా పదోన్నతులు దక్కేలా పాత జీవో నిబంధనల ఆధారంగా తగిన నిర్ణయం తీసుకునేలా ప్రభుత్వం తరపున కృషి చేస్తానని మంత్రి ఫరూక్ తెలిపారు.

# కూటమి ప్రభుత్వంలో మహిళలపై జరుగుతున్న దాడులు ఆపాలని డిమాండ్ చేస్తూ..నిరసన వ్యక్తం చేసిన వైసీపీ నేతలు




**నంద్యాల, జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహిళపై రోజురోజుకూ పెరుగుతున్న ఆకృత్యాలకు అడ్డుకట్ట వేసేదెవరు..? చట్టాలు కేవలం కాగితాలకే పరిమితమా..?"అవును... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటిన నాటి నుంచి మహిళలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలు, అత్యాచారాలు, దారుణ హత్యలు పరాకాష్టకు చేరాయని... పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు ఎవరికీ భద్రత లేకుండా పోయిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు!ఇది నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రం సెంటర్! ఇక్కడ ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా వినతి పత్రం అందజేసి... అధికారంలో ఉన్న పాలకులు కళ్లు తెరవాలంటూ వైఎస్సార్సీపీ నేతలు గళమెత్తారు. ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, స్టేట్ మహిళ విభాగం జనరల్ సెక్రెటరీ శశికళ రెడ్డి, అసెంబ్లీ పరిశీలకుడు సూర్యనారాయణ రెడ్డి, జిల్లా జోనల్ మహిళ ఇన్చార్జి గాజుల శ్వేతా రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాతమ్మతో పాటు భారీగా తరలివచ్చిన మహిళా నేతలు నేడు పెద్ద ఎత్తున నిరసన గళం విప్పారు.ఎమ్మెల్సీ ఇషాక్ బాషా , మహిళా నేతలు మాట్లాడుతూ... "ఇటీవల గుంటూరులో ఏం జరిగింది..? బద్వేలులో ఏం జరిగింది..? కన్నతల్లి లాంటి ఆడపడుచులను దిగంబరంగా చేసి రోడ్డుపై అవమానించిన ఘటనలు చూస్తుంటే... ఇది నాగరిక సమాజమేనా అని గుండె తరుక్కుపోతుందని, సభ్యసమాజం తలదించుకునేలా దారుణాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ హృదయ విదారక సంఘటనలు మన రాష్ట్ర ప్రతిష్టకే మాయని మచ్చగా మారాయని తీవ్రంగా విమర్శించారు. "అత్యంత దారుణమైన విషయమేమిటంటే... ఈ అఘాయిత్యాలకు ఒడిగడుతున్న నిందితుల వెనుక అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు వస్తుంటే ఈ రాష్ట్రంలో మహిళలకు రక్షణ ఎక్కడుంది..? రాజకీయ ఒత్తిళ్లతో కేసులు నమోదు చేయడంలో జాప్యం చేస్తున్నారు. విచారణలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అధికార బలంతో నేరస్థులను కాపాడుతుంటే బాధితులకు న్యాయం ఎలా జరుగుతుంది..?" "చట్టం ముందు అందరూ సమానమే అనే నమ్మకాన్ని ప్రజల్లో నిలబెట్టాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉంది! రాజకీయం వేరు... ఇంట్లో ఉండే ఆడపిల్లల భద్రత వేరు! పక్షపాతం లేకుండా, అధికార బలపరీక్షలు పక్కనబెట్టి నేరస్థులను కఠినంగా శిక్షించకపోతే... కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదని వైకాపా నేతలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరుస్తుందో... లేక ఈ అఘాయిత్యాలను నిర్లక్ష్యం చేస్తూ పోతుందో చూడాలి!" ఈ కార్యక్రమంలో నంద్యాల అసెంబ్లీ అధ్యక్షురాలు హుస్సేనమ్మ, రాష్ట్ర మాజీ దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, మాజీ వైస్ ఎంపీపీ పార్వతమ్మ, బనగానపల్లె అసెంబ్లీ అధ్యక్షురాలు షాజహాన్, మాజీ కౌన్సిలర్స్ కన్నమ్మ, సావిత్రమ్మ, నంద్యాల ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్, మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు కారు రవికుమార్, వైసిపి నాయకుడు సాయిరాం రెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు టివి రమణ, స్టేట్ సెక్రటరీ మధుబాబు, స్టేట్ మైనార్టీ సెల్ సెక్రెటరీ ఇక్బాల్, స్టేట్ బీసీ సెల్ సెక్రటరీ నాగేంద్ర, స్టేట్ జనరల్ సెక్రెటరీ యూనిస్ బాష, నంద్యాల జిల్లా వైసీపీ సెక్రటరీ దేవనగర్ బాషా, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు సుమంత్ రెడ్డి, వైసీపీ జిల్లా యూత్ వింగ్ సెక్రటరీ గగ్గుటూరు చంద్రశేఖర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మేసా చంద్రశేఖర్, మరియు మహిళలు జిల్లా వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



# శిల్పా సూపర్ మార్కెట్ కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధం: నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు



**నంద్యాల, జూలై 21 (పిసిడబ్ల్యూ న్యూస్):** నంద్యాల శిల్పా సూపర్ మార్కెట్లో పనిచేస్తూ ఉపాధి కోల్పోయే ఉన్న సుమారు 42 మంది కార్మికులను ఆదుకోవడానికి, వారిని ఇతర సూపర్ మార్కెట్లు మరియు మాల్స్‌లోకి మార్చడానికి తాము పూర్తిగా సిద్ధంగా ఉన్నామని నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు తెలిపారు .మంగళవారం నంద్యాల మార్కెట్ యార్డ్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు మాట్లాడుతూ శిల్పా సూపర్ మార్కెట్ మూతపడటం వల్ల అక్కడి కార్మికులు ఉపాధి కోల్పోతామని ఆందోళన చెందుతున్న విషయం గౌరవ మంత్రి ఫరూక్ గారి దృష్టికి వెళ్లిందని తెలిపారు. కార్మికుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, మంత్రి ఫరూక్ గారు స్వయంగా చొరవ తీసుకుని ఒక నెల రోజుల క్రితమే (టెండర్లు పూర్తి కాకముందే) తనకు ఫోన్ చేసి మాట్లాడారని చెప్పారు. కమిషనర్‌తో చర్చించి, నంద్యాలలోని వివిధ మాల్స్ మరియు సూపర్ మార్కెట్లలో ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయో వాటన్నింటినీ పరిశీలించి, ఈ 42 మంది కార్మికులకు మెరుగైన ఉపాధి కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారని ఆయన వివరించారు. కార్మికులకు ప్రస్తుతం శిల్పా సూపర్ మార్కెట్లో వస్తున్న జీతం కంటే ఎక్కువ వేతనం లభించేలా మంత్రి ఫరూక్ గారు స్వయంగా యాజమాన్యాలతో మాట్లాడారని, ఈ విషయాన్ని కార్మికులకు తెలియజేసి వారిని పిలిపించాలని ఆదేశించారని హరిబాబు పేర్కొన్నారు.**శిల్పా కుటుంబం అడ్డుకోవడమే విచారకరం:** మంత్రి ఫరూక్ గారి ఆదేశాల మేరకు తాము కార్మికులను పిలిపించి, మాట్లాడటానికి ప్రయత్నించగా కార్మికులు కూడా రావడానికి సిద్ధపడ్డారని, అయితే శిల్పా కుటుంబం మరియు వారి సూపర్ మార్కెట్ మేనేజర్ కార్మికులను అడ్డుకున్నారని చైర్మన్ హరిబాబు తెలిపారు . "మీరు అక్కడికి వెళ్ళడానికి వీల్లేదు, మీరు మా దగ్గరే పనిచేస్తున్నారు" అని చెబుతూ కార్మికులను రానీయకుండా ఒత్తిడి తెచ్చారని అన్నారు. కార్మికుల మేలు కోసం చూస్తున్న ప్రత్యామ్నాయని మరియు మంత్రి ఫరూక్ గారి చొరవను శిల్పా కుటుంబం రాజకీయం చేస్తూ అడ్డుకోవడం సరికాదన్నారు. **వచ్చే నెల 1వ తేదీ నుంచే ఉద్యోగాల్లో చేరవచ్చు:** కార్మికుల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రాధాన్యతని, మంత్రి ఫరూక్ గారు నిన్న కూడా ఈ విషయంపై మాట్లాడి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని చైర్మన్ హరిబాబు తెలిపారు. శిల్పా సూపర్ మార్కెట్ కార్మికులు 42 మంది ఎప్పుడు వచ్చినా సరే, వచ్చే నెల 1వ తేదీ నుంచే వారికి ఇతర మాల్స్‌లో మెరుగైన జీతంతో కూడిన ఉద్యోగాలు ఇప్పించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, కార్మికులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు.ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ యార్డ్ పాలకవర్గ సభ్యులు మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# హాకీ వరల్డ్‌కప్‌నకు భారత జట్టు ప్రకటన



2026 హాకీ ప్రపంచకప్ టోర్నమెంట్‌కు హాకీ ఇండియా భారత జట్టును మంగళవారం ప్రకటించింది. 20 మంది సభ్యులతో కూడిన జట్టుకు హర్మన్‌ప్రీత్ సింగ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ వచ్చే నెల 15న ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లకు నెదర్లాండ్స్, బెల్జియం సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఈ టోర్నీలో భారత్ పూల్ డీలో ఉంది. ఈ గ్రూప్‌లో భారత్‌తోపాటు ఇంగ్లాండ్, పాకిస్థాన్, వేల్స్ జట్లు ఉన్నాయి. పురుషుల టోర్నీలో 16 జట్లు పోటీలో ఉన్నాయి. నాలుగేసి జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. ప్రపంచ కప్ జట్టు ఎంపికపై టీమ్ హెడ్ కోచ్ ఫుల్టన్ మాట్లాడారు. 'ఇది చాలా సమతుల్యమైన జట్టు. ఇందులో అనుభవం ఉన్న ఆటగాళ్లు ఉన్నారు. అలాగే అద్భుతమైన ఫామ్‌లో ఉన్న యువ ఆటగాళ్లూ ఉన్నారు. ఈ ఇద్దరితో టీమ్ బ్యాలెన్స్‌గా ఉంది. భారత్ ప్రపంచ కప్ గెలిచి 50 ఏళ్లు పూర్తయింది. అందుకే ఇది మాకు ఒక ప్రత్యేకమైన ఎడిషన్ కానుంది. ఆ చరిత్ర ఈ వరల్డ్‌కప్‌నకు మాకు ప్రేరణ ఇస్తుంది. ఒత్తిడిలో చురుకైన నిర్ణయాలు తీసుకోవడం, మంచి ఔట్‌పుట్ ఇవ్వడంపైనే మేం దృష్టి పెట్టాము. మా ప్లేయర్లకు ఆట పట్ల నిబద్ధత ఉంది. వారు తమమత అత్యుత్తమ ప్రదర్శననిస్తూ, జట్టులో ఒకరినొకరు ప్రోత్సహించుకుంటున్నారు. పోటీ ఎంత కఠినంగా ఉంటుందో మాకు తెలుసు. కానీ మా ఆటపై మాకు నమ్మకం ఉంది. మా స్ట్రాటజీ సింపుల్. ఆటపైనే పూర్తి దృష్టి పెట్టడం, పూర్తి స్థాయిలో నిమగ్నమవుతూ టైటిల్ సాధించడమే మా టార్గెట్' అని కోచ్ అన్నారు.

పురుషుల హాకీ వరల్డ్‌కప్ 1971లో ప్రారంభం కాగా ఆ ఎడిషన్ (తొలి)లో భారత్ మూడో స్థానంతో సరిపెట్టుకుంది. రెండో ఎడిషన్‌లో రన్నరప్‌గా నిలిచింది. అయితే మూడో ఎడిషన్ (1975లో) ఫైనల్‌లో పాకిస్థాన్‌ను ఓడించిన టీమ్‌ఇండియా టైటిల్ ముద్దాడింది. అర్జిత్ పాల్ సింగ్ కెప్టెన్సీలో టీమ్‌ఇండియా 2-1 తేడాతో పాక్‌ను ఓడించింది. ఇక ఆ తర్వాత భారత్ మళ్లీ ఈ టోర్నీలో టైటిల్ అందుకోలేదు. గత ఎడిషన్ (2023) భారత్ తొమ్మిదో స్థానానికి పరిమితమైంది. ఈసారి బలమైన జట్టుతో భారత్ బరిలోకి దిగుతోంది. 50ఏళ్ల నాటి మ్యాజిక్‌ను రిపీట్ చేసి రెండోసారి ఈ టైటిల్‌ను సాధించడమే లక్ష్యంగా హర్మన్‌ప్రీత్ సేన వరల్డ్‌కప్‌లో ఆడనుంది.జట్టు ప్రకటన సందర్భంగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఈసారి పక్కా 'కప్పును ఇంటికి తీసుకొస్తాం' అని ధీమాగా చెప్పాడు. 'వరల్డ్‌కప్‌ను మరోసారి పక్కా మన ఇంటికి (భారత్‌కు) తీసుకొస్తాం. దేశాన్ని గర్వపడేలా చేసేందుకు మాకు ఇదొక మంచి అవకశం' అని హర్మన్‌ప్రీత్ అన్నాడు.

# జింబాబ్వే గడ్డపై అడుగుపెట్టిన భారత్..



ఇంగ్లాండ్ పర్యటన ముగిసింది. ఆదివారం (జులై 19, 2025) లార్డ్స్ వేదికగా జరిగిన చివరి వన్డేలో భారత్ ఓడిపోయి.. సిరీస్ కోల్పోయింది. అయితే ఇది జరిగిన రెండు రోజుల వ్యవధిలోనే టీమిండియా మరో పర్యటనకు సిద్ధమైంది. జులై 23 నుంచి జింబాబ్వేతో 3 టీ20ల సిరీస్ జరగనుంది. ఇందుకోసం ఇప్పటికే జట్టును సెలక్టర్లు ఎంపిక చేశారు. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో టీమిండియా బరిలోకి దిగింది. ఇక ఈ సిరీస్ కోసం ఒక్క చోట చేరిన భారత ఆటగాళ్లు.. మంగళవారం (జులై 21) జింబాబ్వేలో అడుగుపెట్టారు. ఈ మేరకు భారత ఆటగాళ్లు జింబాబ్వే ప్రయాణానికి సంబంధించిన వీడియోను బీసీసీఐ.. సోషల్ మీడియాలో షేర్ చేసింది. ముంబై టు హరారే అని క్యాప్షన్ ఇచ్చింది. ఇందులో తిలక్ వర్మ, ప్రభ్ సిమ్రాన్ సింగ్, మయాంక్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, రింకూ సింగ్ తదితరులు కనిపించారు. టీమిండియా సీనియర్ జట్టుకు షెడ్యూల్ బిజీగా ఉండటంతో.. వీవీఎస్ లక్ష్మణ్ .. ఈ సిరీస్‌కు తాత్కాలిక హెడ్ కోచ్‌గా ఎంపికయ్యాడు. జట్టుతో పాటు అతడు కూడా జింబాబ్వేకు వెళ్లాడు. భారత క్రికెట్ జట్టు ఇటీవల ముగిసిన ఇంగ్లాండ్ పర్యటనలో ఆశించిన స్థాయి ఫలితాలను సాధించలేకపోయింది. టీ20, వన్డే సిరీస్‌లలో ఓటమి పాలైన నేపథ్యంలో.. జింబాబ్వే పర్యటన కీలకంగా మారింది. యూకే పర్యటనలో ఎదురైన చేదు అనుభవాలను, చేజారిన సిరీస్‌ల పరాజయాలను పక్కన పెట్టి, జింబాబ్వేపై ఘన విజయం సాధించి మళ్లీ గెలుపు బాట పట్టాలని టీమిండియా పట్టుదలతో ఉంది. సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చిన నేపథ్యంలో, ఐపీఎల్‌తో పాటు దేశవాళీ క్రికెట్‌లో అదరగొట్టిన యువ ఆటగాళ్లు.. ఈ సిరీస్‌లో తుది జట్టులోకి రానున్నారు. గౌతమ్ గంభీర్ టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి భారత జట్టు ప్రదర్శన మిశ్రమంగా ఉంది. టీ20 వరల్డ్ కప్ గెలిచినప్పటికీ.. దశాబ్దాల తర్వాత శ్రీలంక చేతిలో ఓడటం, సొంత గడ్డ మీద న్యూజిలాండ్ చేతిలో వైట్ వాష్‌కు గురి కావడం, ఐర్లాండ్, ఇంగ్లాండ్ గడ్డ మీద సిరీస్‌లు ఓడటం లాంటివి చోటు చేసుకున్నాయి. దీంతో గంభీర్ తీరు పట్ల విమర్శలు వస్తున్నాయి. ఐస్‌లాండ్ క్రికెట్ గంభీర్ పరువు తీసేలా ట్వీట్ వేసింది. ఇప్పుడు భారత జట్టు లక్ష్మణ్ మార్గదర్శకత్వంలో జింబాబ్వే టూర్‌కు వెళ్లింది. దీని వల్ల ఇప్పటికిప్పుడు గంభీర్‌కు వచ్చిన ఇబ్బందేం లేదు. సరిపడా విశ్రాంతి తీసుకొని, ఒత్తిడి తగ్గించుకోవడానికి ఇది గంభీర్‌కు ఉపకరిస్తుంది. కానీ భవిష్యత్తు టోర్నీల్లో భారత్ మెరుగైన ప్రదర్శన చేస్తేనే గంభీర్‌పై బీసీసీఐ నమ్మకాన్ని కొనసాగిస్తుంది. లేకపోతే 2027 వరల్డ్ కప్ తర్వాత అతడిపై వేటు పడే అవకాశం ఉంది.భారత్, జింబాబ్వే సిరీస్ షెడ్యూల్..తొలి టీ20: జులై 23 – హరారే స్పోర్ట్స్ క్లబ్‌రెండో టీ20: జులై 25 – హరారే స్పోర్ట్స్ క్లబ్‌మూడో టీ20: జులై 26 – హరారే స్పోర్ట్స్ క్లబ్‌జింబాబ్వే పర్యటనకు భారత టీ20 జట్టు..శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, సూర్యాన్ష్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (వికెట్ కీపర్)



# హిట్‌మ్యాన్‌ను పొగడ్తలతో ముంచెత్తిన రవిశాస్త్రి

లార్డ్స్ మైదానంలో ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో వన్డే మ్యాచ్ కంటే ముందు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాడు. 2027 వన్డే ప్రపంచకప్ వైపు చూస్తున్న భారత సెలెక్టర్లు, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్.. రోహిత్ శర్మను ఇకపై జట్టులోకి తీసుకోకపోవచ్చని, లార్డ్స్ మ్యాచ్ అతనికి ఆఖరిది కానుందంటూ వార్తలు వచ్చాయి. అయితే 39 ఏళ్ల రోహిత్ శర్మ ఈ మ్యాచ్‌లో విశ్వరూపం చూపించాడు. వింటేజ్ ఆటతో ఇంగ్లాండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. దీంతో తనపై విమర్శలు గుప్పించిన వారి నోళ్లను హిట్ మ్యాన్ మూయించాడు.మైదానం నలుమూలలా బాదుతూ రోహిత్ శర్మ ఆడిన షాట్లు లార్డ్స్ మైదానాన్ని హోరెత్తించాయి. తొలి రెండు వన్డేల్లో 11, 26 పరుగులు మాత్రమే చేసి విఫలమైన రోహిత్, ఆఖరి వన్డేలో అద్భుతంగా పుంజుకున్నాడు. 110 బంతుల్లో 138 పరుగులు స్కోరు చేశాడు. ఇందులో 5 సిక్స్‌లు, 17 ఫోర్లు ఉన్నాయి. ఈ ఇన్నింగ్స్‌పై భారత మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి స్పందించాడు. రోహిత్ శర్మ తనకు తానుగా కొత్తగా నిరూపించుకోవాల్సింది ఏమీ లేదని, తన అద్భుతమైన సెంచరీతో విమర్శకుల నోళ్లను శాశ్వతంగా మూయించేశాడని రవిశాస్త్రి పేర్కొన్నాడు. ఒక ఆటగాడు జట్టుకు అంత సేవ చేసిన తర్వాత ఇలాంటి రూమర్లు రావడం విసుగు కలిగిస్తుందని రవిశాస్త్రి వ్యాఖ్యానించాడు. రోహిత్ శర్మలో ఇంకా ఆడేందుకు కసి ఉన్నన్ని రోజులు అతడికి అవకాశం ఇవ్వాలని.. సెలెక్టర్లను కోరాడు. తనకు ఇక ఆడే సామర్థ్యం లేదని రోహిత్ భావించిన రోజే అతడే స్వయంగా తప్పుకుంటాడని రవిశాస్త్రి స్పష్టం చేశాడు. మరోవైపు తన రీఎంట్రీ ఇన్నింగ్స్ పై రోహిత్ శర్మ బీసీసీఐ అప్‌లోడ్ చేసిన వీడియోలో స్పందించాడు. బయట వచ్చే విమర్శలు, కామెంట్లు తనకు అనవసరమని, మైదానంలోకి వెళ్లి పరుగులు సాధించడమే తన బాధ్యత అని రోహిత్ చెప్పాడు. విమర్శలు లేకపోతే కిక్కు ఉండదని, బయట వారు చేసే పని వారు చేస్తుంటే, మైదానంలో తాను చేయాల్సిన పని తాను చేస్తానని ధీమా వ్యక్తం చేశాడు.

# స్పెయిన్‌కు సుమారు రూ.430 కోట్ల ప్రైజ్ మనీ



2026 ఫిఫా ప్రపంచకప్‌కు ఘన ముగింపు లభించింది. అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్రం ఈస్ట్ రూథర్‌ఫోర్డ్‌లో ఉన్న మెట్లైఫ్ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో స్పెయిన్ 1–0 తేడాతో అర్జెంటీనాను ఓడించి ప్రపంచ విజేతగా అవతరించింది. నాలుగేళ్ల క్రితం ఖతార్‌లో సాధించిన టైటిల్‌ను నిలబెట్టుకోవాలన్న అర్జెంటీనా ఆశలు ఫైనల్లోనే ఆగిపోయాయి. మరోవైపు యువ ఆటగాళ్లతో బలంగా కనిపించిన స్పెయిన్ చరిత్రలో రెండోసారి ప్రపంచకప్‌ను ముద్దాడింది. ఈ విజయంతో స్పెయిన్‌కు ప్రపంచ ఫుట్‌బాల్‌లో అత్యున్నత గౌరవంతో పాటు భారీ ఆర్థిక లాభం కూడా దక్కింది. ఫిఫా ప్రకటించిన రికార్డు స్థాయి ప్రైజ్ ఫండ్‌లో విజేతగా నిలిచిన స్పెయిన్‌కు 50 మిలియన్ అమెరికన్ డాలర్లు లభించనున్నాయి. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.430 కోట్లకు సమానం. పురుషుల ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో విజేతకు లభించిన అత్యధిక ప్రైజ్ మనీ ఇదే కావడం విశేషం. ఫైనల్లో ఓడిపోయినా అర్జెంటీనా ఖాళీ చేతులతో వెళ్లలేదు. రన్నరప్‌గా నిలిచిన ఆ జట్టుకు 33 మిలియన్ డాలర్లు దక్కనున్నాయి. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.284 కోట్లకు సమానం. 2022 ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన ఫ్రాన్స్ పొందిన మొత్తంతో పోలిస్తే ఇది మరింత ఎక్కువ. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో ఫ్రాన్స్‌పై ఇంగ్లండ్ విజయం సాధించింది. దీంతో ఇంగ్లండ్‌కు 29 మిలియన్ డాలర్లు (సుమారు రూ.249 కోట్లు), నాలుగో స్థానంలో నిలిచిన ఫ్రాన్స్‌కు 27 మిలియన్ డాలర్లు (సుమారు రూ.232 కోట్లు) ప్రైజ్ మనీ లభించనుంది.ఫిఫా అధ్యక్షుడు జియానీ ఇన్ఫాంటినో నేతృత్వంలోని ఫిఫా కౌన్సిల్ 2025 డిసెంబరులో ప్రకటించిన వివరాల ప్రకారం, 2026 ప్రపంచకప్ కోసం మొత్తం 655 మిలియన్ డాలర్ల ప్రైజ్ ఫండ్‌ను కేటాయించింది. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.5,630 కోట్లకు సమానం. 2022 ప్రపంచకప్‌తో పోలిస్తే ఇది దాదాపు 50 శాతం అధికం. అంతేకాకుండా టోర్నమెంట్‌కు అర్హత సాధించిన ప్రతి జట్టుకు సిద్ధత ఖర్చుల కోసం అదనంగా 1.5 మిలియన్ డాలర్లు కూడా అందజేశారు. అంటే సుమారు రూ.13 కోట్లకు పైగా ప్రతి జట్టుకు ముందుగానే లభించింది. టోర్నమెంట్‌లో వ్యక్తిగత అవార్డుల విభాగంలో ఫ్రాన్స్ స్టార్ స్ట్రైకర్ కిలియన్ ఎంబాపే మెరిశాడు. మొత్తం 10 గోల్స్ చేసి గోల్డెన్ బూట్ అవార్డును సొంతం చేసుకున్నాడు. అతడు నాలుగు అసిస్ట్‌లు కూడా నమోదు చేశాడు. అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ ఎనిమిది గోల్స్, నాలుగు అసిస్ట్‌లతో రెండో స్థానంలో నిలిచాడు. ఈ ప్రపంచకప్‌తో ఎంబాపే తన కెరీర్ వరల్డ్‌కప్ గోల్స్ సంఖ్యను 22కు పెంచుకున్నాడు. దీంతో 21 వరల్డ్‌కప్ గోల్స్‌తో ఉన్న మెస్సి రికార్డును అధిగమించిన ఆటగాడిగా నిలిచాడు.ప్రపంచకప్ విజేత స్పెయిన్ జట్టును ముందుండి నడిపించిన కెప్టెన్ రోడ్రీకి గోల్డెన్ బాల్ అవార్డు దక్కింది. టోర్నమెంట్ మొత్తం స్పెయిన్ ఆటను నియంత్రించడంలో, మిడ్‌ఫీల్డ్‌లో ఆధిపత్యం చెలాయించడంలో రోడ్రీ కీలక పాత్ర పోషించాడు. టోర్నమెంట్‌లో అత్యధిక పాస్‌లు పూర్తి చేసిన ఆటగాడిగా కూడా అతడు రికార్డు సృష్టించాడు. స్పెయిన్ రెండోసారి ప్రపంచకప్ గెలవడంలో రోడ్రీ ప్రదర్శన ప్రధాన కారణంగా నిలిచింది.

# ముగిసిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు

## ఓవరాల్ చాంపియన్‌గా మేడ్చల్ మల్కాజ్‌గిరి

హైదరాబాద్ :మూడు రోజుల పాటు ఉత్సాహంగా సాగిన 11వ సబ్ జూనియర్, జూనియర్ అంతర్‌జిల్లా స్విమ్మింగ్ పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. 54 పసిడి పతకాలు, 50 రజత పతకాలు, 26 కాంస్య పతకాలు సాధించిన మేడ్చల్ మల్కాజ్‌గిరి రాష్ట్ర స్థాయిలో ఓవరాల్‌గా చాంపియన్‌గా నిలిచింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి 472 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. 293 పాయింట్లతో రంగారెడ్డి జిల్లా ద్వితీయ స్థానంలో నిలువగా.. ఆ జిల్లా స్విమ్మర్లు 34 పసిడి, 25 సిల్వర్, 24 కాంస్య పతకాలు కొల్లగొట్టారు.స్విమ్మింగ్ పోటీల్లో విజేతలకు నిలిచిన క్రీడాకారులకు, ఓవరాల్ చాంపియన్‌షిప్స్‌లో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన జిల్లాలకు తెలంగాణ స్విమ్మింగ్ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి జి ఉమేశ్‌లు బహుమతులు ప్రదానం చేశారు.



# షూటింగ్‌లో బాలకృష్ణకు స్వల్ప గాయం



నటసింహం, స్టార్ హీరో నందమూరి బాలకృష్ణ కాకినాడ పోర్ట్ ప్రాంగణంలో జరుగుతున్న తన తాజా చిత్రం 'NBK111' షూటింగ్‌లో ప్రమాదానికి గురయ్యారు. డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం కాకినాడ పోర్ట్ పరిసర ప్రాంతాల్లో కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మంచు మనోజ్‌తో కలిసి ఒక హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్న సమయంలో బాలకృష్ణ అనుకోకుండా కాలుజారి కిందపడటంతో ఆయన మోకాలికి స్వల్ప గాయమైంది.

ఈ ప్రమాదం జరిగిన వెంటనే చిత్ర యూనిట్ సభ్యులు షూటింగ్‌ను అక్కడికక్కడే నిలిపివేసి, ఆయనను తక్షణ చికిత్స కోసం సమీపంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలోని వైద్యుల బృందం బాలకృష్ణకు ప్రాథమిక చికిత్స అందించడంతో పాటు అవసరమైన ఇతర వైద్య పరీక్షలను పూర్తి చేసింది. ఈ గాయం చాలా స్వల్పమైనదేనని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు. అయితే, త్వరగా కోలుకోవడానికి కొన్ని రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని ఆయనకు వైద్యులు సూచించారు.

'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ విజయం తర్వాత బాలకృష్ణ - గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న రెండవ చిత్రం కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. కాకినాడ షెడ్యూల్‌లో రిస్కీ యాక్షన్ దృశ్యాలను తెరకెక్కిస్తున్న సమయంలో ఈ అనుకోని సంఘటన జరిగిందనే వార్త సోషల్ మీడియాలో వ్యాపించడంతో అభిమానులు, సినీ ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి పూర్తిగా స్థిరంగా ఉందని, ఆసుపత్రి నుంచి త్వరలోనే డిశ్చార్జ్ అయి తిరిగి కోలుకుంటారని సమాచారం.



# చరణ్ సరసన రష్మిక?..

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, సెన్సేషనల్ డైరెక్టర్ సుకుమార్ కలయికలో రాబోతున్న చిత్రం 'ఆర్‌సీ17' (వర్కింగ్ టైటిల్)పై సినీ వర్గాల్లో అంచనాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'రంగస్థలం' ఇండస్ట్రీ హిట్‌గా నిలవడం, ఆ తర్వాత సుకుమార్ దర్శకత్వంలో 'పుష్ప' ఫ్రాంచైజీ సినిమాలు చరిత్ర సృష్టించడం నేపథ్యంలో... ఈ కొత్త ప్రాజెక్ట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు తుది దశకు చేరుకున్న ఈ సినిమాని త్వరలోనే సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సినిమాలో హీరోయిన్ ఎవరనే దానిపై ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. మొదట కియారా అద్వానీ పేరు వినిపించినా, తాజాగా నేషనల్ క్రష్ రష్మిక మందన్న పేరు బలంగా వినిపిస్తోంది.

సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన 'పుష్ప' సిరీస్‌తో రష్మిక పాన్-ఇండియా స్థాయిలో స్టార్‌డమ్ సంపాదించుకుంది. ఆ చిత్రంలో ఆమె నటనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు దక్కాయి. ఇప్పుడు 'ఆర్‌సీ17' కోసం సుకుమార్ ఒక బలమైన, కథను మలుపు తిప్పే మహిళా పాత్రను రాసుకున్నారని, ఆ పాత్రకు రష్మిక అయితేనే పూర్తి న్యాయం చేయగలదని ఆయన భావిస్తున్నట్లు సమాచారం. ఆమెకున్న పాన్-ఇండియా ఇమేజ్ కూడా సినిమాకు అదనపు ఆకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం అంచనా వేస్తోంది. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కేవలం గ్లామర్ కోసమే కాకుండా కథాగమనంలో అత్యంత కీలకంగా ఉండనుందని తెలుస్తోంది.చరణ్ మాస్ ఇమేజ్, సుకుమార్ టేకింగ్, దానికి రష్మిక నటన తోడైతే బాక్సాఫీస్ వద్ద కొత్త చరిత్ర ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 'రంగస్థలం'తో రికార్డులు సృష్టించిన ఈ కాంబో, మరోసారి అంతకుమించిన విజయాన్ని అందుకుంటుందని అంచనా వేస్తున్నారు. అయితే, హీరోయిన్ ఎంపికపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.మరోవైపు రష్మిక ప్రస్తుతం తన భర్త విజయ్ దేవరకొండతో కలిసి 'రణబాలి' అనే భారీ పీరియాడిక్ యాక్షన్ చిత్రంలో నటిస్తోంది. రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం, 19వ శతాబ్దంలో రాయలసీమలో కరవు సమయంలో బ్రిటిష్ పాలనపై పోరాడిన ఓ యోధుడి కథ ఆధారంగా తెరకెక్కుతోంది. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత విజయ్-రష్మిక కాంబోలో వస్తున్న మూడో సినిమా కావడంతో దీనిపై కూడా భారీ అంచనాలున్నాయి.



# శ్రీనివాస మంగాపురం నుంచి రావే చెలియా విడుదల

ఘట్టమనేని జయకృష్ణ హీరోగా అజయ్ భూపతి తెరకెక్కిస్తోన్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం' రషా థడానీ కథానాయికగా అలరించనున్నారు. జులై 30న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమా నుంచి లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. రావే చెలియా అంటూ సాగే ఈ పాటలో 'నా ప్రాణం నను వీడి.. నీ వైపే కదిలేనే' అనే లిరిక్స్ యూత్‌ను ఆకట్టుకుంటున్నాయి.


# పంద్రాగస్ట్ పోటీలో సూర్య, నయనతార



తమిళ సినీ పరిశ్రమలో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికర పోరు జరగనుంది. గతంలో 'గజిని', 'ఆధవన్', 'మాస్సు ఎంగిర మసిలామణి' వంటి చిత్రాల్లో కలిసి నటించిన స్టార్ హీరో సూర్య, లేడీ సూపర్ స్టార్ నయనతార ఇప్పుడు ఒకరికి ఒకరు బాక్సాఫీస్ ప్రత్యర్థులుగా మారబోతున్నారు.సూర్య హీరోగా తెరకెక్కుతున్న 'విశ్వనాథ్ / సన్స్' మరియు నయనతార ప్రధాన పాత్రలో రూపొందుతున్న 'హాయ్ ' చిత్రాలు రెండూ ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్నాయి. దీంతో స్వాతంత్య దినోత్సవ సెలవులను లక్ష్యంగా చేసుకుని ఈ రెండు సినిమాలు నేరుగా పోటీ పడనున్నాయి. మొదట 'విశ్వనాథ్ / సన్స్' చిత్రాన్ని ఆగస్టు 14న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. అనంతరం నయనతార నటించిన 'హాయ్' మూవీ మేకర్స్ కూడా అదే తేదీని రిలీజ్ డేట్‌గా ప్రకటించడంతో బాక్సాఫీస్ రేసు మరింత ఆసక్తికరంగా మారింది. 'హాయ్' చిత్రానికి లోకేష్ కనగరాజ్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన విష్ణు ఏడవన్ దర్శకత్వం వహిస్తున్నారు. రొమాంటిక్ కామెడీగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కవిన్ హీరోగా నటిస్తుండగా, కె. భాగ్యరాజ్, రాధికా శరత్‌కుమార్, ప్రభు, వీటీవీ గణెళిష్, సత్యన్, అమృత శ్రీనివాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని రౌడీ పిక్చర్స్, 7 స్క్రీన్ స్టూడియో, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మరోవైపు 'విశ్వనాథ్ / సన్స్' చిత్రంలో సూర్యకు జోడీగా మమితా బైజు నటిస్తున్నారు. కుటుంబ భావోద్వేగాలతో కూడిన హృద్యమైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. ఒకవైపు ఫ్యామిలీ డ్రామాతో సూర్య, మరోవైపు రొమాంటిక్ కామెడీతో నయనతార ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో ఈ రెండు సినిమాల మధ్య బాక్సాఫీస్ పోటీ ఎలా ఉండబోతుందనే ఆసక్తి సినీ అభిమానుల్లో నెలకొంది. స్వాతంత్య్ర దినోత్సవ వీకెండ్‌లో తమిళ సినీ పరిశ్రమలో ఈ క్లాష్ హాట్ టాపిక్‌గా మారింది.



# 'టాక్సిక్' నుంచి రెండో పాట.. యశ్-తారా రొమాన్స్‌తో 'మనసు ఆగదు'!



రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' విడుదలకు సిద్ధమవుతోంది. ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా నుంచి చిత్రబృందం రెండో పాట 'మనసు ఆగదే'ను విడుదల చేసింది. ఇప్పటికే వచ్చిన తొలి పాట 'తబాహి'తో బోల్డ్ రొమాంటిక్ టోన్‌ను చూపించిన మేకర్స్.. ఇప్పుడు రెండో పాటలో అంతకుమించిన రొమాన్స్‌ను ఆవిష్కరించారు.ఈ పాటలో యశ్, బాలీవుడ్ నటి తారా సుతారియా మధ్య కెమిస్ట్రీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. బాత్‌టబ్‌లో తారా ఎంట్రీ, ఆమెకు యశ్ గన్‌తో ఎంగేజ్‌మెంట్ రింగ్ తొడిగే సీన్, వర్షంలో ఇద్దరి రొమాంటిక్ మూమెంట్స్, కేఫ్‌లో ముద్దులతో సాగే సన్నివేశాలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. విడుదలైన కొన్ని గంటల్లోనే ఈ పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.లేడీ డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, తారా సుతారియా, హుమా ఖురేషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ సినిమాకు విశాల్ మిశ్రా, కనిష్క్ బాగ్చీ సంగీతం అందిస్తుండగా, కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది. రెండో పాట విడుదలతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

# 'ఇరుముడి' డబ్బింగ్ ప్రారంభించిన రవితేజ

రవితేజ హీరోగా శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న 'ఇరుముడి' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. తాజాగా ఈ చిత్రానికి రవితేజ డబ్బింగ్ ప్రారంభించారు. షూటింగ్‌లో తన భాగాన్ని పూర్తి చేసిన ఆయన స్టూడియోలో డబ్బింగ్ చెబుతున్న వీడియోను చిత్రబృందం విడుదల చేసింది. అందులో "నాకు ఒకే ఒక్క కూతురు... ఆమె పేరు మణెమ్మ" అంటూ రవితేజ చెప్పిన డైలాగ్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఈ వీడియోలో దర్శకుడు శివ నిర్వాణ, బాలనటి నక్షత్ర కూడా కనిపించారు.ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. మరో మూడు రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉన్నట్లు సమాచారం. మరోవైపు జి.వి. ప్రకాశ్‌కుమార్ రీ-రికార్డింగ్ పనులు కూడా ప్రారంభించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో కూతురిపై అపారమైన ప్రేమ చూపించే తండ్రిగా రవితేజ కనిపించారు. అనూహ్య సంఘటనల తర్వాత మద్యానికి బానిసైన అతడు, కూతురు మాటతో అయ్యప్ప మాల ధరించి జీవితాన్ని మార్చుకునే ప్రయాణం కథలో కీలకంగా ఉండనుంది.రవితేజ కెరీర్‌లో 77వ చిత్రంగా వస్తున్న 'ఇరుముడి'లో భక్తి, భావోద్వేగాలు, కమర్షియల్ అంశాలను సమపాళ్లలో మేళవించినట్లు చిత్రబృందం చెబుతోంది. తండ్రీకూతుళ్ల అనుబంధమే కథకు ప్రధాన బలమని సమాచారం. ఇందులో ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, బేబీ నక్షత్ర రవితేజ కూతురి పాత్రలో కనిపించనుంది. సాయికుమార్, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, శ్వాసిక కీలక పాత్రలు పోషిస్తున్నారు.

